ప్రజాశక్తి

శనివారం 20 జనవరి 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

పరిహారం ఊసేలేదు



చీడికాడలో తడిసిన పంటను చూపుతున్న రైతులు (ఫైల్‌ఫోటో)

- మిచౌంగ్ తుపానుకు 16,472 ఎకరాల పంట నష్టం
- నివేదికను పట్టించుకోని ప్రభుత్వం
- సాయం కోసం బాధిత రైతుల ఎదురుచూపు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

మిచౌంగ్ తుపాను డిసెంబరులో రైతును కోలుకోలేకుండా చేసింది. పంట నష్టపోయిన రైతును ఆదుకుంటామని భరోసా ఇచ్చిన ప్రభుత్వం రోజులు గడుస్తున్నా దాని ఊసే ఎత్తడం లేదు. సాంకేతిక కారణాల సాకుతో వాస్తవిక పంట నష్టం కంటే వ్యవసాయశాఖ తక్కువ నష్టం అంచనావేసి ప్రభుత్వానికి నివేదించింది. అయినా ఇంతవరకూ సర్కారు రైతుకు పంటనష్ట పరిహారం చెల్లించలేదు. సంక్రాంతి పండగకు ముందు పరిహారం అందితే కుటుంబ అవసరాలు తీరుతాయని రైతులు భావించారు. పండగ తరువాతైనా డబ్బులు పడితే పండగకు చేసిన అప్పులు తీర్చుకుంటామని అనుకున్నారు. చివరకు ప్రభుత్వం రైతుకు నష్టపరిహారం ఇవ్వకపోవడంతో వారంతా నిరాశలో ఉన్నారు.

జిల్లాలో గత డిసెంబరులో వచ్చిన మిచౌంగ్ తుపానుతో 27,833 మంది రైతులకు చెందిన 16,413 ఎకరాల్లోని రూ.11.16 కోట్ల విలువైన వరి పంటకు నష్టం జరిగినట్లు వ్యవసాయశాఖ ప్రభుత్వానికి నివేదించింది. 123 మంది చెరుకు రైతులకు చెందిన 58.92 ఎకరాల్లో నాలుగు లక్షల విలువైన పంట దెబ్బతిన్నట్లు నివేదికలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వ్యవసాయశాఖ పంట నష్టం వివరాలను నివేదించినా ఇంతవరకు పరిహారం రైతుకు ఇవ్వలేదు.

జిల్లాలో గతేడాది ఖరీఫ్‌లో 2.04 లక్షల ఎకరాల్లో సాగు కావాల్సివుంది. తీవ్రమైన కరువు పరిస్థితులతో 1.35 లక్షల ఎకరాల్లో పంట నమోదైంది. ఇందులో వరి 1.36 లక్షల ఎకరాలకు 1.10 లక్షల ఎకరాల్లో సాగైంది. అక్టోబర్‌లో వర్షాల్లేకపోవడంతో ఐదు వేల ఎకరాలకు పైగా వరి పంట ఎండిపోయింది. జిల్లాలోని 24 మండలాలకు 25 నుంచి 50 శాతం మధ్య వర్షపాతం లోటు 12 మండలాల్లో ఏర్పడింది. నక్కపల్లి, పాయకరావుపేట, రాంబిల్లి, అచ్యుతాపురం మండలాల్లో 50 మిగతా 2లో..



అనకాపల్లిలో చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు

బకాయిలు తీర్చకపోవడం అన్యాయం

యుటిఎఫ్ ఆధ్వర్యాన పలుచోట్ల నిరసనలు వార్త 5లో..

నేడు లోక్‌నాయక్ పురస్కారాలు ప్రదానం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన పలువురు ప్రముఖులకు ఎన్‌టిఆర్ వర్ధంతి, ఎఎన్ఆర్ శత జయంతి కార్యక్రమాలను పురస్కరించుకొని లోక్‌నాయక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జీవన సాఫల్య పురస్కారాలను ప్రదానం చేయనున్నట్టు ఫౌండేషన్ అధ్యక్షులు, రాజ్యసభ మాజీ సభ్యులు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తెలిపారు. ఎయు హిందీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ శనివారం ఉదయం 10.30 గంటలకు రుషికొండ భీమిలి బీచ్ రోడ్డులోని ఎ1 గ్రాండ్ కన్వెన్షన్‌లో ఈ కార్యక్రమం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తామన్నారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ నటుడు మిగతా 2లో..

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం

వార్త మెయిన్‌లో..

విశాఖలో కులగణన ప్రారంభం

వార్త 2లో..

సౌత్‌జోన్ మహిళా వన్డే జట్టుకు ముగ్గురు ఎంపిక

వార్త 3లో..



విశాఖలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసేందుకు భారీగా తరలివచ్చిన అంగన్‌వాడీలు

అంబేద్కర్‌కు వినతులు

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె వార్తలు 8లో..

జంపింగ్ జపాంగ్‌లు

- కండువాలు మార్చుతున్న నాయకులు
- ఉమ్మడి విశాఖ జిల్లాలో అధికార పార్టీకి పెద్ద దెబ్బే !



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఎన్నికల సమయం సమీపిస్తున్న వేళ.. ఉమ్మడి విశాఖ జిల్లాలోని నియోజకవర్గాల్లో ఆశావహుల సంఖ్య భారీగా పెరుగుతోంది. ఈ క్రమంలో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేనల్లో 'జంపింగ్ జపాంగ్'లు ఒక చోట నుంచి మరోచోటుకు స్పీడుగా కదులుతున్నారు. ఇక గోడమీద పిల్లి వాటాలు పనికి రావు.. ఆ గట్టో ఈ గట్టో తేల్చుకోకపోతే రాజకీయంగా నష్టపోతామన్న ఆందోళనతో పలువురు నాయకులు హుటాహుటిన 'కండువాలు' మార్చేస్తున్నారు. వైసిపిని ముఖ్య నాయకులంతా వీడడం ఈ కాలంలో ప్రధాన రాజకీయ పరిణామంగా ఉంది. ఆయా అసెంబ్లీ సెగ్మెంట్లలో సీట్లను ఆశించి భంగపడిన వారంతా ఠక్కున టిడిపి లేదా జనసేన పార్టీ కండువాను కప్పుకోవడం పరిపాటిగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా అధికార పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియోజకవర్గాల్లో బరిలో ఎవరుండాలన్న అంశంపై తాజాగా తీసుకున్న నిర్ణయాలు, ఉమ్మడి విశాఖ జిల్లాలో స్థానిక పరిస్థితులూ కొంత తోడై వైసిపికి ముఖ్యనేతలంతా గుడ్‌బై చెబుతున్నారు. అలాంటి వారిలో విశాఖ జిల్లా అధ్యక్షులుగా పనిచేసిన పంచకర్ల రమేష్‌బాబు ముందే జనసేన పార్టీలో చేరగా, ఇటీవలే ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ వైసిపిని వీడారు. విశాఖలో ప్రారంభం నుంచీ వైసిపి వెంట నడిచి ఆ పార్టీలో వంశీకృష్ణ కీలకంగా వ్యవహరించారు. తూర్పు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టికెట్‌ను ఎంపీ ఎంవివి సత్యనారాయణకు వైసిపి అధిష్టానం ఖరారు చేయడంతో వంశీ పార్టీని వీడారు. తాజాగా బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్ దక్షిణ నియోజకవర్గంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ వ్యవహారశైలిపై విసుగెత్తిపోయి బయటకొచ్చారు. ఆయన సహా పలువురు కార్పొరేటర్లు, కేడర్ సీతంరాజు వెంట నడుస్తున్నారు. అనకాపల్లి జిల్లా నుంచి దాడి వీరభద్రరావు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

పరిహారం ఊసేలేదు

శాతానికి మించి వర్షపాతం లోటు ఏర్పడినా ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించలేదు. వరి పంట కోసిన సమయంలో భారీ తుపాను రావడంతో దాదాపు 25 వేల ఎకరాలకు పైగా పంట నష్టం జరిగింది. కోసిన వరి నీటితో తడిసింది. కోయాల్సిన పంట గాలులకు పడిపోయి, నీటమునిగింది. దీంతో దిగుబడులు గణనీయంగా తగ్గాయి. చేతికి రావాల్సిన పంట కళ్లముందే నీళ్లపాలైంది. పెట్టిన పెట్టుబడులకు పంట చేతికిరాలేదు. అయినా ప్రభుత్వం వీటిని పరిగణనలోకి తీసుకోలేదు. వాస్తవిక పంట నష్టం కుదించి పరిహారం ఇచ్చేందుకు తగిన సాంకేతిక నిబంధనలు రూపొందించింది. 33 శాతానికిపైగా నష్టపోయిన పంటను వ్యవసాయశాఖ గుర్తించి 16,413 ఎకరాల్లో వరి, 58.92 ఎకరాల్లో చెరకు పంట దెబ్బతిన్నట్లు ప్రభుత్వానికి నివేదించింది. నెల గడిచినా సర్కారు నుంచి పరిహారం రైతుకు అందలేదు. వ్యవసాయశాఖాధికారులు మాత్రం పంట నష్టపోయిన రైతులకు త్వరలో ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుందని చెబుతున్నారు.

జంపింగ్ జపాంగ్‌లు

కుటుంబం మొత్తంగా టిడిపి తీర్థం పుచ్చుకుంది. విశాఖలో మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్ వైసిపిలో ఉన్నా పూర్తిగా తటస్థంగా ఉన్నారు.

వైవి.సుబ్బారెడ్డినే కారణమా ?

ఉత్తరాంధ్ర రీజియన్ వైసిపి సమన్వయకర్తగా వైవి.సుబ్బారెడ్డి వచ్చాక పార్టీలో ఏ పరిస్థితినీ చక్కదిద్దలేకపోవడం, వార్డులు, గ్రామాలు, నియోజకవర్గాల్లో పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో వైసిపిని అత్యధిక మంది ఈ కాలంలో వదిలినట్లు ఆ పార్టీలో తాజాగా పెద్ద చర్చనే జరుగుతోంది. విశాఖలో మధ్యతరగతి, ఉద్యోగులు ఇప్పటికే వైసిపికి వ్యతిరేకంగా అభిప్రాయాలు చెప్పడం తెలిసిందే. 2019లో నగరంలోని నాలుగు సెగ్మెంట్లను వైసిపి కోల్పోయింది. తాజాగా కూడా ఇదే పరిస్థితి నెలకొందన్న చర్చ ఆ పార్టీలో సాగుతోంది. పార్టీలో అంతర్గత కుమ్ములాటలను, నియోజకవర్గాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలను గతంలో ఈ ప్రాంత వైసిపి సమన్వయకర్తగా వ్యవహరించిన విజయసాయిరెడ్డి చాకచక్యంగా పరిష్కరించడమే కాకుండా కార్పొరేషన్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు కైవసం చేసుకునే దిశగా పావులు కదిపారని వైసిపి శ్రేణులు, పార్టీని వీడిన నేతలు సైతం చెప్పుకొస్తున్నారు. వైవి.సుబ్బారెడ్డి బాధ్యతలు తీసుకున్నాక వైసిపికి పలువురు రాజీనామాలు చేయడం, తిరుగుబావుటా ఎగరేయడం వంటివి పెరిగిపోయాయి. ఏం చెప్పినా విని ఊరుకుంటారని, సమస్యలను పరిష్కరించాలన్న చొరవ చేయరని ఆయనపై విమర్శలు ఉన్నాయి. విశాఖలో పార్టీని పలువురు వీడిపోవడానికి రాష్ట్ర అధిష్టానం కొంత కారణమైతే.. వైవి.సుబ్బారెడ్డి ఇక్కడ అడుగుపెట్టిన నుంచీ వ్యవహరిస్తున్న తీరూ మరొక కారణమని అధికార పార్టీ సీనియర్ నాయకులు వాపోతున్నారు. విశాఖలో వైసిపిలో చేరిన ఇండిపెండింట్ కార్పొరేటర్లు ఇద్దరు ఇటీవలే జనసేనలో చేరగా, తాజాగా దక్షిణ నియోజకవర్గంలో పార్టీ వ్యతిరేక గ్రూపులు నడుపుతున్నారని నలుగురు కార్పొరేటర్లను సైతం ఆ పార్టీ సస్పెండ్ చేయడంతో వైసిపి ఇక్కడ ఎదురీదే పరిస్థితులు నెలకొన్నాయి. అయితే ఈ పరిణామాలన్నిటినీ తెలుగుదేశం, జనసేన పార్టీలు తీక్షణంగా పరిశీలిస్తూ 2024 ఎన్నికల్లో ఎవరెక్కడ ఎలా ఉపయోగపడతారోనన్న ప్రణాళికలతో కదులుతున్నాయి. సీట్లను ఆశిస్తూ టిడిపి గట్టున చేరిన వారు 'జంపింగ్ జపాంగ్'ల్లో గణనీయంగా ఉండడంతో తమకీ భవిష్యత్తులో తలనొప్పులు తప్పవని టిడిపి అధిష్టానం భావిస్తున్నట్లు భోగట్టా.

నేడు లోక్‌నాయక్ పురస్కారాలు ప్రదానం

కొణిదెల చిరంజీవి హాజరవుతారన్నారు. సభాధ్యక్షులుగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ ఆకుల శేషసాయి వ్యవహరిస్తారన్నారు. గౌరవ అతిథులుగా 'పద్మభూషణ్' సత్కార గ్రహీత, పూర్వ హోం కార్యదర్శి, ప్రధానమంత్రి సలహాదారులు కె.పద్మనాభయ్య, విజ్ఞాన్ విద్యాసంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ లావు రత్తయ్య, రాష్ట్ర మాజీ మంత్రి, విశాఖ ఉత్తర నియోజక వర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హాజరవుతారన్నారు ఈ కార్యక్రమంలో లోక్ నాయక్ ఫౌండేషన్ 19 సంవత్సరాలుగా ఎన్‌టిఆర్ పుణ్యతిథి రోజున రూ.2 లక్షల నగదుతో ప్రధానం చేసే సాహిత్య పురస్కారాన్ని యండమూరి వీరేంద్రనాథ్‌కి ఈ ఏడాది ప్రదానం చేస్తామన్నారు. తాము ప్రతి ఏటా ఇచ్చే జీవిత సాఫల్య పురస్కారాలను ముగ్గురు ప్రముఖులకు ప్రదానం చేస్తామన్నారు. బెంగళూరు తెలుగు సమాఖ్య అధ్యక్షులు రాధాకృష్ణం రాజు, ప్రఖ్యాత మనోవైద్యులు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, అంతర్జాతీయ పర్యటన శాఖా నిపుణులు, కవి విల్సన్ సుధాకర్ తుల్లిమిల్లికి తమ ఫౌండేషన్ జీవన సాఫల్య పురస్కారాలు ప్రదానం చేస్తామన్నారు. వీరికి తలా 50 వేల రూపాయల నగదు బహుకరించి సత్కరిస్తామన్నారు. విలేకరుల సమావేశంలో ఫౌండేషన్ సభ్యులు నల్ల బాబయ్య, శివరామ్ పాల్గొన్నారు.

1023వ రోజుకు ఉక్కు జెఏసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఏసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం నాటికి 1023వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.మన్మథరావు, ప్రధాన కార్యదర్శి జివిఎస్‌కె.అచ్యుతరావు, జిల్లా నాయకులు డాక్టర్ బూసి వెంకటరావు, సిహెచ్.కాసుబాబు, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రక్రియ ఆగేవరకూ పోరాటం కొనసాగుతుందన్నారు.

కులగణన ప్రారంభం



కులగణన సర్వేను పరిశీలిస్తున్న జెసి విశ్వనాథన్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన ప్రక్రియ శుక్రవారం విశాఖలో ప్రారంభమైంది. తొలిరోజు సర్వే చురుగ్గా సాగింది. జిల్లా పరిధిలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఆయా సచివాలయ సిబ్బంది, ఇతర విభాగాల ఉద్యోగులు భాగస్వామ్యమై డిజిటల్ మోడ్ విధానంలో ప్రజల నుంచి వివరాలు సేకరించారు. కులగణన ప్రక్రియను జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ పర్యవేక్షించారు. పందిమెట్ట ప్రాంతంలో దసపల్లా హిల్స్ సచివాలయ పరిధిలో జరిగిన సర్వేను పరిశీలించిన ఆయన డిజిటల్ రూపంలో వివరాలను సేకరించే తీరును గమనించి పలు సూచనలు చేశారు. ప్రక్రియను సమర్థవంతంగా సజావుగా నిర్వహించాలని, పక్కా వివరాలను సేకరించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. సిబ్బందితో పాటు పలు గృహాలను సందర్శించిన ఆయన స్థానిక ప్రజలతో మాట్లాడారు. పర్యటనలో ఆయన వెంట జోనల్ కమిషనర్ శివప్రసాద్, డిఎల్‌డిఒ పూర్ణిమాదేవి, ఇతర ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను వేగవంతం చేస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి జివిఎంసి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని ఆమె ఛాంబర్లో జివిఎంసి ప్రధాన ఇంజినీరు రవికృష్ణరాజు, పర్యవేక్షక ఇంజినీర్లు, కార్యనిర్వాహక ఇంజినీర్లతో నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే టెండర్లు పిలిచిన పనులను సంబంధిత కాంట్రాక్టర్లచే ప్రారంభించి నిర్ణీత సమయనికి పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మౌలిక వసతులలో రాజీ లేకుండా అభివృద్ధి పనులు చేపట్టాలని ఆదేశించారు.

తపాలా ఏజెంట్ల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : తపాలా శాఖ అందిస్తున్న జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా సేవలను విస్తృతం చేసేందుకు ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విశాఖపట్నం సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసు గజేంద్ర కుమార్ మీనా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు వివరించారు. పదో తరగతి పూర్తి చేసిన ఆసక్తిగల అభ్యర్థులను విశాఖపట్నం డివిజన్ నందు కమీషన్ ప్రతిపాదికన నియమిస్తామని తెలిపారు. అన్ని తపాలా కార్యాలయాల్లో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయన్నారు.

ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 30వ తేదీన ఉదయం పదిన్నర గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల సమయంలో వెలంపేటలోని సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసు వద్దకు రావాలని సూచించారు.మరిన్ని వివరాల కోసం 8143810007 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కొనసాగుతున్న ఆర్‌టిసి కార్మికుల రిలే దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆర్‌టిసి కార్మికుల రిలే నిరాహార దీక్షలు రెండో రోజైన శుక్రవారమూ కొనసాగాయి. ఎపిఎస్ ఆర్‌టిసి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్టుమెంట్ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నేతృత్వంలో జరుగుతున్న ఈ దీక్షల్లో శుక్రవారం ఉదయం ఆఫ్ డ్యూటీ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ రీజనల్ సెక్రటరీ బి.నీలకంఠం మాట్లాడుతూ వెంటనే 1/2019 సర్క్యులర్‌ను అమలు చేసి, రద్దు చేసిన షెడ్యూల్స్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో యూనియన్ నాయకులు పిళ్లా శంకర్రావు, విఎస్‌ఆర్.మూర్తి, సిపి.కుమార్, ఎన్‌ఎంయుఎ అన్ని డిపోల కార్యదర్శులు, డివిజనల్ సెక్రెటరీలు, జోనల్ సెక్రెటరీలు పాల్గొన్నారు.

దళిత ద్రోహి జగన్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దళిత ద్రోహిగా మిగిలిపోతారని మాజీ ఎమ్మెల్యే, టిడిపి దక్షిణ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ అన్నారు. జగన్‌పై కోడికత్తితో దాడి చేశారని ఆరోపణలు ఎదుర్కొంటూ జైలులో ఉన్న శ్రీనుకి న్యాయం జరగాలని శుక్రవారం ఎవిఎన్ కళాశాల అంబేద్కర్ విగ్రహం వద్ద పలువురు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ జగన్ దళితులను అన్ని రకాలుగా మోసం చేశారన్నారు.



వాహనదారులతో ఎస్ఐ

ఎస్ఐ తీరుపై అసహనం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం బోయపాలెం సిగ్నల్ వద్ద హైవేపై యూటర్న్ తీసుకుంటూ రాకపోకలు సాగిస్తున్న వాహనదారులపై ట్రాఫిక్ ఎస్ఐ అప్పలరాజు సిగ్నల్ జంపింగ్ అంటూ గంటపైన ద్విచక్ర వాహనాలు, ఆటోలను ఆపి తీవ్ర ఇబ్బందులు పెట్టడంతో వాహనదారులు, స్థానికులు అసహనం వ్యక్తం చేశారు. బోయపాలెం ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర హైవేపై కాపులుప్పాడ వెళ్లే రోడ్డు నుంచి యూటర్న్ తీసుకుని మధురవాడ వైపు వెళ్లే వాహనాదారుల తాళాలు, సెల్ ఫోన్లు తీసుకొని ఎస్ఐ అప్పలరాజు దౌర్జన్యానికి దిగుతున్నారని స్థానికులు వాపోతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

కులగణన సర్వర్ల మొరాయింపు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలంలో శుక్రవారం చేపట్టిన కులగణన సర్వే 26 గ్రామ పంచాయతీల్లో సర్వర్లు మొరాయించడంతో అధికారులు ఇబ్బందులు పడ్డారు. వారం రోజుల్లోగా పూర్తిచేయాల్సిన నేపథ్యంలో మొదటి రోజే సర్వర్లు మొరాయించడంతో తిప్పలు తప్పలేదు. వాలంటీర్లు సర్వేపై పట్టు సాధించలేకపోతున్నారు.

సమస్యలుంటే చెప్పండి

ప్రజాశక్తి -తగరపువలస : సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తేవాలని జివిఎంసి ఒకటో వార్డు జనసేన అధ్యక్షులు పరిమి భువనేశ్వరి స్థానిక ముస్లిము సోదరులకు సూచించారు. ఒకటో వార్డు పరిధిలో ఉన్న పలువురు ముస్లిము సోదరులను శుక్రవారం ఆమె కలిసి వారి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. వ్యక్తి గత, సామాజిక పరమైన సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే, సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు

సిఐలు బాధ్యతల స్వీకరణ



పద్మనాభం సిఐ

ప్రజాశక్తి -యంత్రాంగం

పద్మనాభం : పద్మనాభం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా సిహెచ్ శ్రీధర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎన్.సన్యాసినాయుడును సిపి కార్యాలయానికి అటాచ్ చేస్తూ విశాఖ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖ విఆర్‌లో ఉన్న శ్రీధర్‌ను పద్మనాభం సిఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆనందపురం : ఆనందపురం సిఐగా టీవీ తిరుపతిరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు విజయనగరం రూరల్‌లో పనిచేశారు. శుక్రవారం ఉదయం ఆనందపురం చేరుకున్న సిఐ స్టేషను సందర్శించారు. అనంతరం సిపి కార్యాలయానికి వెళ్లారు.



ఆనందపురం సిఐ

గణతంత్ర వేడుకలకు సర్పంచ్ ఛాయాగౌతమి

ప్రజాశక్తి-భీమునిపట్నం : దేశ రాజధాని ఢిల్లీలో ఈ నెల 26వ తేదీన జరుగనున్న గణతంత్ర వేడుకలకు రాష్ట్రం నుంచి ఎంపికైన 13 మంది సర్పంచుల్లో విశాఖ జిల్లా భీమిలి మండలం, టి.నగరపాలెం పంచాయితీ సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి ఉన్నారు. ఈ మేరకు సంబంధిత అధికారులు తనకు సమాచారం పంపినట్లు ఆమె తెలిపారు. ఇందుకు గాను పలువురు గ్రామస్తులు శుక్రవారం హర్షం వెలిబుచ్చారు. గణతంత్ర వేడుకల్లో తమ పంచాయతీకి ఇలా ప్రాతినిధ్యం దక్కడం ఎంతో ఆనందంగా ఉందని స్థానికులు అభిప్రాయపడ్డారు.



2023లో ఉత్తమ పంచాయతీగా...

పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా టి.నగరపాలేన్ని ఉత్తమ పంచాయతీ గా ఎంపిక చేసిన రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగం "గుడ్ గవర్నెన్స్" అంశంపై సర్పంచ్ చాయా గౌతమికి 2023 ఏప్రిల్ 24న అవార్డును అందజేసిన విషయం విదితమే. ఏపి పంచాయతీ రాజ్ విభాగం కమిషనర్ సూర్య కుమారి ద్వారా సర్పంచ్ అవార్డు అందుకున్నారు.

సమతుల్య అభివృద్ధిపై దృష్టి

గ్రామ పంచాయతీలో అన్ని రంగాలు సమానంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో సర్పంచ్ చాయా గౌతమి అహర్నిశలు కృషి చేస్తున్నారు. 2,300 మంది జనాభా ఉన్న ఈ పంచాయతీలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నారు. పంచాయతీ ప్రజలు, వార్డు సభ్యులు, మండల పరిషత్, గ్రామ సచివాలయ అధికారులు, సిబ్బంది, వాలంటీర్ల సహకారంతో పాటు స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపిపి దంతులూరి వెంకటశివసూర్య నారాయణ రాజు, జెడ్‌పిటిసి సభ్యులు గాడు వెంకటప్పడు సూచనలు, సహాయ సహకారాలను తీసుకుంటూ పంచాయతీ సమగ్రా భివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు ఆమె తెలిపారు. సమిష్టి కృషి ఫలితంగానే పంచాయతీలో మెరుగైన పనితీరు కబరుస్తున్నట్లు పేర్కొన్నారు. తనను ఎంపిక ద్వారా పంచాయతీ ప్రజలకే ఈ గౌరవం దక్కినట్లు అని ఆమె తెలిపారు.

నవోదయ ప్రవేశ పరీక్ష ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి -పిఎం పాలెం : కొమ్మాది సమీపంలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయంలో రానున్న విద్యా సంవత్సరంలో ఆరవ తరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్షకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు నవోదయ ప్రిన్సిపల్ కె.సంజయ్ తెలిపారు. శనివారం ఉదయం 11.30 నుంచి 1.30 వరకు నిర్వహించే ఈ పరీక్ష కోసం విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన 44 కేంద్రాలను ఏర్పాట్లుచేశామని చెప్పారు. 8107 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలకు 10.45 గంటలకు చేరుకోవాలని, 11.30 తరువాత వచ్చే అభ్యర్థులను అనుమతించరని స్పష్టంచేశారు. పరీక్షను బ్లూ లేదా బ్లాక్ కలర్ బాల్ పాయింట్ పెన్‌తో రాయాలని తెలిపారు. ఎలక్ట్రానిక్ పరికరాలను, ఇతర కాగితాలు, జామెట్రీ బాక్సులను అనుమతించరని పేర్కొన్నారు. ప్రతి కేంద్రంలో నిర్వాహకులతో పాటు ఒక పరిశీలకుడు ఉంటారని తెలిపారు. ప్రశ్న పత్రాలు ఒకగంట ముందు మాత్రమే పరీక్షా కేంద్రాలకు బ్యాంకుల నుంచి ప్రత్యేక అధికారులు చేరవేస్తారని చెప్పారు. ఇన్విజిలేటర్లను లాటరీ పద్ధతిలో పంపించనున్నట్లు తెలిపారు.

సౌత్ జోన్ మహిళా వన్డే జట్టుకు ముగ్గురు ఎంపిక



స్నేహ దీప్తి



ఎం.దుర్గ



ఎమ్‌డి షబ్నమ్

ప్రజాశక్తి -పిఎం పాలెం : సౌత్ జోన్ సీనియర్ మహిళా వన్డే క్రికెట్ టీమ్‌కు స్నేహ దీప్తి, ఎం.దుర్గ, ఎండీ షబ్నమ్ ఎంపికైనట్లు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్ఆర్.గోపినాథ్‌రెడ్డి వెల్లడించారు. స్నేహ దీప్తి సౌత్ జోన్ జట్టుకు వైస్ కెప్టెన్‌గా ఎంపికైనట్లు తెలిపారు. వారికి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు పి.శరత్‌చంద్రారెడ్డి, కార్యదర్శి ఎస్ఆర్.గోపినాథ్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

సినీ దర్శకులు గోపాలకృష్ణకు సన్మానం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కళా సాహితీ సంస్థ ఆధ్వర్యాన సినీ దర్శకులు ఎన్.గోపాలకృష్ణను స్థానిక చిన్న బజారులోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేడున్న ప్రత్యేక పరిస్థితుల్లో సినిమాల చిత్రీకరణ అనేది భారీ ఖర్చుతో కూడిన దని, ఈ నేపథ్యంలో తాను డాక్యుమెంటరీ చిత్రాలను చిత్రీకరిస్తున్నానని తెలిపారు. కళా సాహితీ సంస్థ అధ్యక్షులు పి.రాజేంద్రప్రసాద్‌వర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక సిఐ డి.రమేష్, సంస్థ కార్యదర్శి ఎ.సన్యాసిరాజు, గౌరవాధ్యక్షులు ఆర్.అప్పలనరసయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం బాలలచే సంప్రదాయ నృత్య ప్రదర్శనలు జరిగాయి.

టోల్ దోపిడీ : పీతల

ప్రజాశక్తి-సీతమ్మధార : అనకాపల్లి నుంచి ఆనందపురం వరకూ విశాఖ నగరంలో నుంచి 2000 సంవత్సరంలో రూ.62 కోట్లతో జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఎఐ) నిర్మించిన రహదారి పేరిట అగనంపూడి వద్ద టోల్ మాఫియా ఇప్పటికి రూ. వేల కోట్లు వసూలు చేసి దోపిడీకి పాల్పడుతోందని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆరోపించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్‌హెచ్ఎఐ విశాఖ నగరంలో నుంచి వెళ్లే ఈ రహదారికి ప్రత్యామ్నాయంగా ఆనందపురం నుంచి అనకాపల్లి వరకూ పెందుర్తి మీదుగా కొత్త రహదారిని నిర్మించిందని, అందులో రెండు టోల్ గేట్లను ఏర్పాటు చేసి అక్కడ వసూలు ప్రారంభించిందని తెలిపారు. దానినే జాతీయ రహదారిగా గుర్తించి విశాఖ నగరంలోని రహదారికి జాతీయ రహదారి హోదాను తీసివేస్తూ గెజిట్ కూడా జారీ చేశారని గుర్తుచేశారు. అయినా టోల్ వసూలు మాత్రం ఆగడం లేదన్నారు. ఇందుకు ఎన్‌హెచ్ఎఐ అధికారుల లంచగొండితనం, జివిఎంసి చేతకానితనం, కొందరు అధికార పార్టీ పెద్దల అవినీతి, పార్లమెంటు సభ్యులు నిర్లిప్తతే కారణమని ఆరోపించారు. 2017లో దీనిపై హైకోర్టులో కేసు పడగా 2019 తీర్పు ప్రజలకు అనుకూలంగా వచ్చిందని తెలిపారు. అసలు ఇది జాతీయ రహదారే కానప్పుడు టోల్ వసూలు చేయరాదని హైకార్టు తీర్పు ఇచ్చిందని, గట్టిగా మాట్లాడితే పాత బకాయిలను కూడా జివిఎంసికి చెల్లించాల్సి వస్తుందని అప్పటి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్ కుమార్ బెంచ్‌పై నుంచి హెచ్చరిక జారీ చేశారని గుర్తుచేశారు. దీంతో టోల్ గేటును మూసి వేశారని తెలిపారు. ఆ సమయంలోనే రాష్ట్రంలో ప్రభుత్వం మారడం, వైసిపి ప్రభుత్వ పెద్దలు కొందరు మాఫియాకు లొంగిపోవడం, టోల్ బూత్‌లను తొలగించకపోవడంతో టోల్ మాఫియా అసత్యాలతో సుప్రీం కోర్టును ఆశ్రయించి తాత్కాలిక రిలీఫ్ ఆర్డర్ పొందిందని వివరించారు. వెంటనే సుప్రీంకోర్టులో కౌంటర్ ఫైల్ చేయాల్సిన జివిఎంసి కొందరు ప్రభుత్వ పెద్దల ఒత్తిడిలో మిన్నకుండి పోవడంతో నాలుగున్నరేళ్లుగా జాతీయ రహదారి కాని రహదారిలో టోల్‌ను విశాఖ వాసులు చెల్లిస్తున్నారని తెలిపారు.

తెలగ కులస్తులను బీసీలో చేర్చాలని వినతి

ప్రజాశక్తి -యంత్రాంగం

ఆనందపురం : తెలగ కులస్తులను బీసీలో చేర్చి రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ ఆనందపురం మండల రెవెన్యూ డిప్యూటీ తహశీల్దార్ రాజేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఉత్తరాంధ్ర తెలగ కుల ప్రతినిధి పల్లంట్ల వెంకట రామారావు పిలుపుమేరకు ఆనందపురం మండలంలోని కుల పెద్దలు, యువత కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలగ కుల పెద్దలు కూరాకుల మురళి, కూరాకుల వెంకటేష్, సురకత్తుల నారాయణరావు, తాటిశెట్టి దొరబాబు, బావిశెట్టి శేషగిరిరావు, గుండు నానాజీ, గుండు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం : తెలగ కులస్తులను బీసీలుగా గుర్తించాలని పద్మనాభం తహశీల్దార్ కె.వేణుగోపాల్‌కు రెడ్డిపల్లి గ్రామానికి చెందిన యువకులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. 80 శాతం తెలగ ప్రజలు దారిద్ర రేఖకు దిగువున ఉన్నారని, ఉపాధి కోసం ఉత్తరాంధ్రాను వదిలి పలు రాష్ట్రాలు, దేశాలకు వెళ్లి జీవనం సాగిస్తున్నారని వివరించారు. రిజర్వేషన్ లేక ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. తహశీల్దార్ స్పందిస్తూ ఈ వినతిని కలెక్టర్‌కు పంపిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి మాజీ సభ్యులు కె.దామోదరరావు, పి.అప్పలరాజు, వి.గణపతి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు

ప్రజాశక్తి- పద్మనాభం : విజయవాడలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆవిష్కరిస్తున్న సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాలకు నాయకులు పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. పద్మనాభం జంక్షన్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఎంపిపి రాంబాబు, రెడ్డిపల్లి గ్రామ సచివాలయం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి దళిత నాయకుడు ఈశ్వరరావు, వైస్ ఎంపిపి ఈర్ల రాజేశ్వరి, పాండ్రంగి గ్రామంలో దళిత నాయకుడు సత్యనారాయణ, ఎంపిపి ఆధ్వర్యాన పూలమాలలు వేశారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న శిష్టకరణ సంఘం ప్రతినిధులు

శిష్టకరణాల కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 5వ వార్డు పరిధి మారికవలసలోని చర్చిలో శుక్రవారం పిఎం.పాలెం శిష్టకరణాల సేవా సంఘం, శ్రీహెల్ప్ ఆల్ అసోసియేషన్ సంయుక్త నిర్వహణలో పాస్టర్ గంటా రవి పాల్, సంఘం అధ్యక్షులు డొంకాడ అనిల్‌కుమార్, సంఘాల సభ్యులు ఆధ్వర్యాన 2024 కేలండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎం.లక్ష్మి, పాడి కనకమహాలక్ష్మి, డొంకాడ వసంత, మేరీ రమ్య, వై.సంతోష్ కుమార్, జి.కుష్బు, గొడవ గౌరీ, నమ్మి సంతోషి, సత్య పార్వతి, తేజస్విని పాల్గొన్నారు.

గంటాపేటలో సిసి రోడ్డు

ప్రజాశక్తి -ఆనందపురం : పందలపాక పంచాయతీలో గంటాపేట -తర్లువాడను కలుపుతూ సిసి రోడ్డు ఏర్పాటుకు సర్పంచ్ బిఆర్‌బి నాయుడు శుక్రవారం పనులు ప్రారంభించారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సహకారంతో పంచాయతీలో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు రూ.10 లక్షలతో సిసి రోడ్డు పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, చందక ఎంపిటిసి సభ్యులు విజినిగిరి అప్పలనాయుడు, ఎఇ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ బిఆర్‌బి.నాయుడు

ఉత్తరాంధ్రకు తీరని అన్యాయం

లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు బాబ్జీ

ప్రజాశక్తి-సీతమ్మధార: జగన్మోహన్‌రెడ్డి పాలనలో ఉత్తరాంధ్రకు తీరని అన్యాయం జరిగిందని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ఆరోపించారు. రామా టాకీస్ వద్దగల పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ ఆధ్వర్యాన ఉత్తరాంధ్ర చర్చా వేదిక తరపున గత ఏడాది జనవరి 7న విశాఖపట్నంలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటుచేసి స్వతంత్ర ఉత్తరాంధ్ర నిపుణుల కమిటీ బృందం ఉత్తరాంధ్ర డిక్లరేషన్ విడుదల చేసిందని, ఆ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపినా మంత్రులు, ఎమ్మెల్యేల్లో కనీసం స్పందనలేదని తెలిపారు. ఉత్తరాంధ్రకు కొత్త పరిశ్రమలు రాకపోగా ఉన్నవి మూతపడ్డాయన్నారు. ఏటికొప్పాక, తాండవ, అనకాపల్లి, భీమసింగి కో-ఆపరేటివ్ సుగర్ ఫ్యాక్టరీలు మూతపడటంతో చెరకు రైతులు, కార్మికులు తీవ్రంగా నష్టపోయరని పేర్కొన్నారు. జ్యూట్ మిల్లులు, ఫెర్రో కర్మాగారాలు మూతపడ్డాయన్నారు. రాష్ట్ర విభజన సమయంలో కేంద్రం ఇచ్చిన హామీలను సాధించడంలో కూడా జగన్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి నిధుల కేటాయింపు లేదని, ఉత్తరాంధ్రలో ఒక్క నీటి పారుదల ప్రాజెక్టునూ పూర్తిచేయలేదని తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల రైతులు, యువత ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలసపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. విశాఖపట్నంలోని కెజిహెచ్, విమ్స్‌లో సదుపాయాలు లేక రోగులు అల్లాడుతుంటే పట్టించుకొనే నాథుడు లేని పరిస్థితి ఉందన్నారు. ఉత్తరాంధ్ర నుంచి ఇద్దరు డిప్యూటీ ముఖ్యమంత్రులు, నలుగురు మంత్రులు ఉన్నా ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయారని విమర్శించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకుడు ఎంఎస్ఎన్.మూర్తి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కంచిపాటికి సత్కారం

ప్రజాశక్తి-పెందుర్తి : జనసేన నాయకులు కంచిపాటి విశ్వనాథనాయుడును గోపాలపట్నం జనసేన కార్యాలయంలో జిల్లా తూర్పు కాపు సంఘం జనరల్ సెక్రెటరీ ఎమ్.సన్యాసిరావు, డికె.బాబు, సతీష్, తారాకేష్ కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు. అనంతరం విశ్వనాథ నాయుడు మాట్లాడుతూ, పార్టీ సిద్ధాంతాలు నచ్చి జనసేనలోకి వచ్చానని తెలిపారు. రానున్న ఎన్నికల్లో జనసేన, టిడిపి పొత్తు ఉన్నచోట గెలుపునకు కృషి చేయాలని కోరారు. పెందుర్తి నియోజకవర్గంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విశాఖ ఉమ్మడి జిల్లా రూరల్ అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబును కలిసి నియోజకవర్గంలోని విషయాలపై చర్చించారు.

'25న ఎన్నికల శంఖారావం సభకు తరలిరండి'

ప్రజాశక్తి -యంత్రాంగం

గాజువాక : భీమిలిలో ఈనెల 25 తేదీన జరగబోయే ఎన్నికల శంఖారావం సభకు తరలిరావాలని గాజువాక వైసిపి ఇన్‌ఛార్జి, 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి రామచంద్రరావు (చందు) కోరారు. నడుపూరులో శుక్రవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల శంఖారావం సభను విజయవంతం చేయాలని పార్టీ కార్యకర్తలను, అభిమానులను, వాలంటీర్లను, గృహ సారథులను కోరారు. ఈ కార్యక్రమంలో 76వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి దొడ్డి రమణ, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పరాంకుశం, ప్రమీల, నరసింహమూర్తి, కులుకురి మంగరాజు, మంత్రి శంకర్ నారాయణ పాల్గొన్నారు.

భీమునిపట్నం : అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కేడర్‌ను సమాయత్తం చేసే క్రమంలో ఈ నెల 25న నియోజకవర్గంలో నిర్వహించ తలపెట్టిన భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని పార్టీ నాయకులకు స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పిలుపు నిచ్చారు. జివిఎంసి పరిధిలో ఉన్న వార్డులు, భీమిలి మండలంలోని వైసిపి నాయకులతో శుక్రవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సభా వేదిక ఏర్పాటుకు అనువైన ప్రాంతం ఎక్కడైతే బాగుంటుందనే అంశంపై చర్చించారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి పాల్గోనున్న బహిరంగ సభను విజయవంతం చేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు.

బిఆర్‌టిఎస్ రోడ్డులో వాకింగ్ వద్దు : ఎస్ఐ

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి పరిధి వేపగుంట నుంచి సింహాచలం పోవు బిఆర్‌టిఎస్ రోడ్డులో తెల్లవారుజామున ఎవరూ వాకింగ్ చేయెుద్దని పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ సూచించారు. ఉదయం పూట చాలా దట్టమైన పొగమంచు కురుస్తుండటంతో వాహనదారులకు రోడ్డు కనిపించడంలేదని తెలిపారు. దీని కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశముందని, ఈ రహదారిలో వాకింగ్‌కు వెళ్లకుండా ఉండాలని సూచించారు.

కుంచుమాంబ కాలనీ రోడ్డుపై చెత్త

దుర్వాసనతో ప్రజల ఇబ్బందులు

ప్రజాశక్తి -గాజువాక : కంచుమాంబకాలనీ చివరి భాగం, ఆటోనగర్ ప్రారంభంలో రోడ్డుపై విపరీతమైన చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. పందులు కుక్కలు స్వైర విహారం చేసి చెత్తను చెల్లాచెదురు చేస్తున్నాయి. రోడ్డుపై ప్రయాణించే వారు, స్థానికులు దుర్వాసనకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దోమలు, ఈగలు విపరీతంగా పెరిగి ఇళ్లల్లోకి చేరుతున్నాయి. రోడ్డు మీద చెత్త ఉందని ప్రతి ఒక్కరూ పాడైన వస్తువులను కూడా విసిరేయడంతో డంపింగ్ యార్డ్‌లా తయారైంది.

చెత్తకు సరిహద్దు సమస్య

ఈ కాలనీలో చెత్త పేరుకుపోవడానికి ప్రధాన కారణం సరిహద్దు సమస్యగా కనిపిస్తోంది. కుంచుమాంబ కాలనీ జివిఎంసి పరిధిలోకి వస్తుంది. ఆటోనగర్ ఐలా పరిధిలోకి వస్తుంది. పేరుకుపోయిన చెత్త స్థలం జివిఎంసిది కాదని శుభ్రం చేయకుండా వదిలేస్తున్నారు. తమ స్థలం పరిధిలోకి రాదని ఐలా చెబుతోంది. ఇదే పరిస్థితి వడ్లపూడి సరిహద్దు వద్ద కూడా చోటు చేసుకుంది. ఇటీవల వడ్లపూడి స్థానికులు ఫిర్యాదు చేయడంతో రెండు రోజుల క్రితం ఐలా సిబ్బంది శుభ్రం చేశారు. వచ్చిన పన్నులలో 30 శాతం జివిఎంసికి చెల్లిస్తున్నామని సరిహద్దు ఏరియాలను వారు శుభ్రం చేయలేరా అని ఐలా అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఈ రెండు విభాగాల గొడవల కారణంగా కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికుల కోరుతున్నారు.

దీనిపై జివిఎంసి గాజువాక జోనల్ అసిస్టెంట్ హెల్త్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్‌ను వివరణ కోరగా, అన్ని ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నామని, కుంచమాంబ కాలనీని పరిశీలించి తొందర్లోనే శుభ్రం చేస్తామని చెప్పారు.



రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

అక్రమ కట్టడాలకు జరిమానా

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-సీతమ్మధార : జోన్-5లో అనధికారికంగా జరుగుతున్న నిర్మాణాలకు టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులిచ్చి జరిమానా విధించారు. 'అక్రమ కట్టడాల జోరు' శీర్షికన ప్రజాశక్తిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి జివిఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించారు. అనధికార నిర్మాణాలను శుక్రవారం పరిశీలించారు. టౌన్ ప్లానింగ్ నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్న నిర్మాణాలకు నోటీసులిచ్చారు. భవనాలను బట్టి జరిమానాలు విధించారు. టిడిఆర్ పెట్టుకోవాలని వారిని ఆదేశించారు. ఈ పరిశీలనలో టిపిఒ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

నేడు పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-సీతమ్మధార: ప్రముఖ చారిత్రక నవలా రచయిత ఎస్డీవీ అజీజ్ (కర్నూలు) రచించిన అల్లూరి సత్యనారాయణరాజు నవల హిందీ అనువాదం పుస్తకావిష్కరణ సభ శనివారం పౌర గ్రంథాలయంలో జరగనుందని అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు తెలిపారు. శనివారం సాయంత్రం 6 గంటలకు మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. విశిష్ట అతిథిలుగా ప్రముఖ న్యాయవాది అల్లూరి సీతారామరాజు, ఏపీ క్షత్రియ పెడరేషన్ అధ్యక్షుడు చెరుకూరి వెంకటపతిరాజు, మిమ్స్ ఛైర్మన్ అల్లూరి సత్యనారాయణ, రచయిత ఎస్డీవీ అజీజ్ పాల్గొంటారని పేర్కొన్నారు. విశ్రాంత హిందీ ఉపాధ్యాయులు బి.రాధారాణి పుస్తక సమీక్ష చేస్తారని తెలిపారు. కవులు, రచయితలు, సాహిత్య అభిమానులు సభకు హాజరై జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

బొత్సను కలిసిన ముమ్మన

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు శుక్రవారం నగరంలో విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఇరువురు పలు సమస్యలపై చర్చించారు. పార్టీ పటిష్టతకు అందరూ సహకరించాలని మంత్రి బొత్స కోరారు. ఈ కార్యక్రమంలో 95వ వార్డు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్‌సి ఓట్ల కోసమే అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ఎమ్మెల్యే గణబాబు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి -గోపాలపట్నం : అంబేద్కర్ విగ్రహ ప్రారంభోత్సవం కేవలం ఎస్‌సి ఓటు బ్యాంకు కోసమేనని విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ఆరోపించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నాలుగున్నరేళ్ళలో దళితులపై 6 వేలకుపైగా దాడులు జరిగాయన్నారు. ఇందులో 158 మంది హత్యకు గురయ్యారని తెలిపారు. ఇదేనా దళితులపైన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చూపిస్తున్న ప్రేమ అని ప్రశ్నించారు. రాజ్యాంగబద్ధంగా అమలు కావలసిన 27 పథకాలను రద్దుచేసి ఏ మొహం పెట్టుకొని అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని ప్రశ్నించారు. దళితులకు ఉద్యోగం, ఉపాధి దూరం చేశారన్నారు. విశ్వవిద్యాలయాల్లో ఒక్క దళితుడినైనా ఉప కులపతిగా నియమించారా అని ప్రశ్నించారు. జగన్ ప్రభుత్వంలో అనేకమంది సలహాదారులు ఉన్నారని, వారిలో దళితుడు ఒక్కరైనా ఉన్నారా అని అడిగారు. టిడిపి ప్రభుత్వ హయాంలో దళిత విద్యార్థులకు విదేశాల్లో విద్యను అభ్యసించేందుకు అంబేద్కర్ విదేశీ విద్యాదీవన పథకాన్ని అమలు చేస్తే ఆ పథకాన్ని జగన్మోహన్‌రెడ్డి అటకెక్కించారని విమర్శించారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలోని దళితులపై హత్యలు జరుగుతుంటే ఆయన ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. నా ఎస్‌సిలు, నా బీసీలనే చెప్పుకునే జగన్మోహన్‌రెడ్డికి వారి అభివృద్ధిలో మాత్రం చిత్తశుద్ధి లేదని విమర్శించారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 50వేల బ్యాక్ లాక్ పోస్టులు భర్తీ చేయలేదన్నారు.

అంగన్‌వాడీలకు మద్దతుగా విరాళాల సేకరణ



ప్రసాద్ గార్డెన్‌లో విరాళాలు సేకరిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - యంత్రాంగం

విశాఖ కలెక్టరేట్ : అంగన్‌వాడీల ఉద్యమానికి మద్దతుగా సిఐటియు జగదాంబ జోన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం విరాళాల సేకరణ ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘం జోన్ కార్యదర్శి కెవిపి.చంద్రమౌళి మీడియాతో మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యమానికి చేయూతగా ప్రసాద్ గార్డెన్స్‌లో ఇంటింటికీ వెళ్లి విరాళాలు సేకరించామని తెలిపారు. ప్రజలు స్పందిస్తూ అంగన్‌వాడీల బాధలను తెలుసుకుంటూ విరాళాలను స్వచ్ఛందంగా ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో సంఘం సీనియర్ నాయకులు వై.రాజు, ఎం.సుబ్బారావు, మత్స్యకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు సంఘీభావంగా నిలబడదాం

ఉక్కునగరం : అంగన్‌వాడీల పోరాటానికి సంఘీభావంగా నిలబడదామని స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్‌లోని స్టోర్ జంక్షన్ వద్ద సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీల పోరాటానికి మద్దతుగా సంఘీభావ నిధిని స్టీల్ సిఐటియు ఆధ్వర్యాన సేకరించారు. ఈ సందర్భంగా అయోధ్యరామ్ మాట్లాడుతూ, వీరి సమస్యపై ప్రభుత్వం మొండి వైఖరి అవలంభిస్తోందన్నారు. స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ, ఒకపక్క ప్రభుత్వం చర్చలు జరుపుతూనే మరోపక్క "ఎస్మా"ను ప్రయోగించి సమ్మెను అణిచివేయాలని తీవ్రంగా ప్రయత్నిస్తోందని విమర్శించారు. పట్టుదలతో రాజకీయాలకతీతంగా పోరాడుతున్న వీరికి మద్దతుగా ఆర్థిక సహాయం అందించడం మనందరి బాధ్యత అన్నారు. స్టీల్ కార్మిక వర్గం సంఘీభావ నిధికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి.దాస్ మాట్లాడుతూ, సుప్రీంకోర్టు తీర్పులను కూడా విస్మరించి ప్రభుత్వం మొండిగా వ్యవహరించడాన్ని ఆయన తప్పుపట్టారు. ఈ సమావేశంలో స్టీల్ సిఐటియు ప్రతినిధులు పి.శ్రీనివాసరాజు, బి.అప్పారావు, టివికె.రాజు, యు.వెంకటేశ్వర్లు, గంగాధర్, కృష్ణమూర్తి, బి.మహేష్, కె.సత్యనారాయణ, విడివి.పూర్ణచంద్రరావు, బి.మురళి, మొహిద్దీన్, డిఎస్‌వి.శ్రీనివాస్, బిఎన్.మధుసూదన్, వివిధ విభాగాల అధ్యక్ష, కార్యదర్శులు, కార్మికులు పాల్గొన్నారు.



స్టీల్‌ప్లాంట్ స్టోర్ జంక్షన్ వద్ద విరాళాలు సేకరిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి
శనివారం 20 జనవరి 2024

ఉద్యోగుల బకాయిలు తీర్చకపోవడం అన్యాయం

- యుటిఎఫ్ ఆధ్వర్యాన విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో నిరసనలు



విశాఖలో మోకాళ్లపై నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం బకాయి ఉన్న రూ.18 వేల 96 కోట్లును చెల్లించకపోవడం ఎలాంటి న్యాయమో ప్రభుత్వ పెద్దలు చెప్పాలని యుటిఎఫ్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్.అంబేద్కర్ ప్రశ్నించారు. శుక్రవారం సాయంత్రం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సంఘం ఆధ్వర్యంలో మోకాళ్లపై నిల్చొని ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలకు సంబంధించిన ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ ఆయా బకాయిలను నేటికీ చెల్లించకపోవడం అన్యాయమన్నారు. ప్రతి నెలా 1న జీతాలు చెల్లించాలని, 12వ పిఆర్‌సి కమిటీని ఏర్పాటు చేసినప్పటికీ ఆ కమిటీ విధి విధానాలు వెల్లడించకపోవడం ఉద్యోగ, ఉపాధ్యాయులను మభ్యపెట్టడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. 12వ పిఆర్‌సి పట్ల చిత్తశుద్ధి ఉంటే వెంటనే 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బకాయిలను విడుదల చేయని పక్షంలో ఈ నెల 24న జిల్లా స్థాయి నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తామని, 31 నుంచి ఫిబ్రవరి 3 వరకూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద రిలే దీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.అప్పారావు, జిల్లా గౌరవాధ్యక్షులు అనకాపల్లి పైడిరాజు, సహాధ్యక్షులు రొంగలి ఉమాదేవి, జిల్లా కోశాధికారి కె.రాంబాబు, జిల్లా కార్యదర్శులు చుక్క సత్యం, రియాజ్ అహ్మద్, టి.జగన్, సీనియర్ నాయకులు ఊడికల రాంబాబు, భీమిలి ప్రధాన కార్యదర్శి టి.రాజు, చినగదిలి అధ్యక్షులు ఎన్.ప్రసాద్, సత్యనారాయణ, శోభ, హాక్, రామేశ్వరి పాల్గొన్నారు.

అనకాపల్లి : రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం బకాయి ఉన్న రూ.18,096 కోట్లు వెంటనే చెల్లించాలని, 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని కోరుతూ ఎపి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం అనకాపల్లి పట్టణంలో నెహ్రూ చౌక్ వద్ద చెవిలో పువ్వులు పెట్టుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ మాట్లాడుతూ యుటిఎఫ్ ఆందోళన ఫలితంగా పిఎఫ్ బకాయిలు కొంత చెల్లించినప్పటికీ, మిగిలిన బకాయిల సంగతేమిటని ప్రశ్నించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని, ఓపిఎస్ అమలు చేయాలని, మిగిలిన పిఆర్‌సి, డిఎ, పిఎఫ్, ఏపీ జిఎల్ఐ బకాయిలు వెంటనే చెల్లించాలని, మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి, కోశాధికారి జోగా రాజేష్, కార్యదర్శి శేషుకుమార్, రాష్ట్ర కౌన్సిలర్ మారిశెట్టి వెంకటప్పారావు, సీనియర్ నాయకులు జీకేఆర్ స్వామి, దేముడునాయుడు, సుభాషిణిదేవి, కామరాజు, సలీం, బండారు శంకర్, ఈశ్వర్, రవి, తేజ్ వర్ధన్, నూతన్ తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలు తక్షణమే చెల్లించాలని యుటిఎఫ్ నర్సీపట్నం డివిజన్ నాయకులు నల్ల రిబ్బన్లు కట్టుకొని స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ డివిజన్ నాయకుడు జంగా వరప్రసాద్ మాట్లాడుతూ, పిఎఫ్, ఎపిజిఎల్ఐ రుణాలు, సరెండర్ లీవ్స్, పెండింగ్ డిఎ, అరియర్స్, పిఆర్సి బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు నాయుడు, చిట్టయ్య, అడిగర్ల సత్యనారాయణ, జల్లూరు ప్రసాదు, జేవీ నర్సింగరావు, సాంబమూర్తి, లోవరాజు, స్వర్జన రాజు, ఈశ్వర వర్మ తదితరులు పాల్గొన్నారు



నర్సీపట్నంలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు



శివకిరణ్‌ను సత్కరిస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జికి వీడ్కోలు సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి, 13వ అడిషనల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ శివకిరణ్ బదిలీ అయిన నేపథ్యంలో అనకాపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం వీడ్కోలు సత్కారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు గంగరాజు శ్రీవిద్య, పి ప్రదీప, బీవీ విజయలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సాయి లక్ష్మణ్, సురా శ్రీనివాసరావు, సీనియర్ న్యాయవాదులు రమణయ్య, గోవిందరాజులు, రాజశేఖర్, కుమార్, సాయిరాం, కుసుమ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల గ్రీవెన్స్‌కు 5 దరఖాస్తులు


ప్రజాశక్తి- అనకాపల్లి : కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఉద్యోగుల గ్రీవెన్స్‌కు 5 దరఖాస్తులు వచ్చాయి. నెలలో ప్రతి 3వ శుక్రవారం నిర్వహించే ఉద్యోగుల గ్రీవెన్స్‌లో కలెక్టరేట్ పరిపాలనాధికారి ఏ. శ్రీనివాసరావు దరఖాస్తులు స్వీకరించారు.

అక్రమంగా నీటి వ్యాపారం

- చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి దాసరిగెడ్డ రోడ్, ముత్రాసి వీధిలో నీరు అక్రమ వ్యాపారంపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ముత్రాసి వీధిలో ఏపీ వాల్టా చట్టానికి విరుద్ధంగా మున్సిపల్ తాగునీటి బోరుకు కేవలం 24 అడుగుల దూరంలో పాడుబడిన బావిలో తప్పుడు పత్రాలతో ఉచిత వ్యవసాయ బోరును ఏర్పాటు చేసి, కరెంట్ మీటర్‌ను ఏర్పాటు చేసుకొని ఆ బావిలోని నీటి ఎన్నో ఏళ్లగా అక్రమంగా కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు అమ్ముకోవడంపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై స్థానికులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ పాడుబడ్డ బావిలో అనేక సార్లు వీధి కుక్కలు, కోళ్ళ వంటి జంతువులు పడి చనిపోయి, తీసే ఆస్కారం లేక అందులోనే కుళ్లిపోయాయని, దీనిపై అధికారులకు అనేక సార్లు విన్నవించించినా, వారి నుండి ఎటువంటి స్పందన కనిపించలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై కలెక్టర్ ఆదేశాల మేరకు ఎమ్మార్వో నేతృత్వంలో మున్సిపల్ కమిషనర్, ఎలక్ట్రికల్ డిఈ, గ్రౌండ్ వాటర్ డిపార్ట్మెంట్ అధికారులు సంఘటన స్థలానికి వచ్చి శుక్రవారం విచారణ చేయవలసి ఉంది. అయితే అధికారులు స్థానికులకు ఎటువంటి సమాచారం లేకుండా గైర్హాజరు కావడం పట్ల స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు అక్రమదారులతో చేతులు కలిపి ప్రజలకు న్యాయం చెయ్యడానికి వెనకడుగు వేస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. అధికారులు తమ పారదర్శకతను నిరూపించుకోవాలని ముత్రాసి వీధి ప్రజలు డిమాండ్ చేశారు. ఈ విషయంపై కలెక్టర్ జోక్యం చేసుకొని తగు న్యాయం చేయాలని కోరారు.



పాడుపడిన బావికి పంపు సెట్ ఏర్పాటు చేసిన దృశ్యం



కేలండర్, డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

యుఇఇయు కేలండర్, డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-చోడవరం

యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ముద్రించిన 2024 కేలండర్, డైరీని స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ శుక్రవారం తన నివాసం వద్ద ఆవిష్కరించారు. విద్యుత్ కార్మికులు, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వానికి తెలియజేయాలని, వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించే యోచన విరమించుకోవాలని యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేపాడ సత్యనారాయణ ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో రీజనల్ అధ్యక్షుడు ప్రేమ చంద్రశేఖర్, డివిజన్ ప్రెసిడెంట్ నాగ అప్పారావు, జి సత్యనారాయణ, బి కొండలరావు, బి రవి ప్రసాద్, కే రవి, కే సుబ్బారావు, జెసిఎస్ నియోజకవర్గం కన్వీనర్ వెంపలి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వేల్పుల వీధి గౌరీ పరమేశ్వరుల మహోత్సవం

ప్రజాశక్తి- అనకాపల్లి

165 సంవత్సరాల ఘన చరిత్ర ఉన్న అనకాపల్లి వేల్పుల వీధి శ్రీగౌరీ పరమేశ్వరుల మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఉత్సవ కమిటీ అధ్యక్షులు వాకాడ బాబు, కార్యదర్శి మద్దాల నూకరాజు, ఉపాధ్యక్షుడు సీరం శెట్టి నరసింగరావు, సహాయ కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి వేల్పుల గణేష్ తెలిపారు. పట్టణంలోని ప్రధాన పురవీధులని విద్యుద్దాలంకరణతో అలంకరించారు. ఈ సందర్భంగా భారీ స్టేజ్ సెట్టింగులు ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం నాలుగు గంటల నుంచి భక్తులకు దర్శనం చేసుకునేందుకు ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని పురవీధుల్లో వివిధ నేల వేషాలు సాంస్కృతిక కార్యక్రమాల మధ్య ఊరేగించనున్నట్టు తెలిపారు. ఉత్సవాన్ని తిలకించేందుకు వచ్చేందుకు వారికి ఎటువంటి అసౌకర్యం జరగకుండా తగిన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

ల్యాండ్ ఫిల్ విస్తరణ ఆపాలని నిరసన



నినాదాలు చేస్తున్న తాడి గ్రామస్తులు

ప్రజాశక్తి - పరవాడ

పరవాడ జెఎన్ ఫార్మసిటీ డెవలపర్ రాంకీ యాజమాన్యం తాడి గ్రామంలో చేపట్టనున్న ల్యాండ్ ఫిల్ విస్తరణను తక్షణమే ఆపాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో స్థానికులు శుక్రవారం గ్రామంలోని జివిఎంసి సబ్ జోనల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ తాడి గ్రామ సమీపంలో సర్వేనెంబర్ 116లో రాష్ట్ర ప్రభుత్వం మరో 50 ఎకరాలు కేటాయించడంతో రూ.200 కోట్లతో రాంకీ యాజమాన్యం ల్యాండ్ ఫిల్ విస్తరణ పనులు చేపట్టనుందని, దీని వల్ల కాలుష్యం మరింత పెరగనుందని తెలిపారు. ప్రజలను పొమ్మనకుండా పొగే విధంగా రాంకీ యాజమాన్యం ఈ ల్యాండ్ ఫిల్ పనులకు సిద్ధమవుతుందన్నారు. ఇప్పటికే ఉన్న ల్యాండ్ ఫీల్డ్ వల్ల భూగర్భ జలాలు నాశనమై తాడి గ్రామం కాలుష్యం కోరల్లో చిక్కుకొని స్థానికులు అల్లాడుతున్నారని, దీనికితోడు మరో కాలుష్య కుంపటి పెట్టడం దుర్మార్గమని పేర్కొన్నారు. ల్యాండ్ ఫిల్ విస్తరణకు ఈనెల 30న పరవాడ తహశీల్దారు కార్యాలయంలో ప్రజా అభిప్రాయ సేకరణ పెట్టడం అన్యాయమన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం గ్రామాన్ని తరలించాలన్నారు. గ్రామాన్ని తరలించకుండా ల్యాండ్ ఫిల్ విస్తరణ పనులు చేపట్టడం దుర్మార్గమన్నారు. గ్రామస్తుడు పైల కృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారంగా గ్రామాన్ని తరలించాలని డిమాండ్ చేశారు. ప్రజాభిప్రాయ సేకరణ పరవాడలో పెట్టడం కాదని, దమ్మంటే తాడి గ్రామంలో నిర్వహించాలన్నారు. తాడి గ్రామ నాయకుడు జి.మాధవరావు మాట్లాడుతూ గ్రామాన్ని తరలించకుండా ల్యాండ్ ఫిల్ చేపడితే తాడి ప్రజలంతా కలిసి అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పైడిరాజు, రమణ, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

దళితులను మభ్యపెట్టేందుకే అంబేద్కర్ విగ్రహం

ప్రజాశక్తి- అనకాపల్లి

అంబేద్కర్ విగ్రహం పెట్టినంత మాత్రాన దళితులను మభ్యపెట్టలేరని, నాలుగున్నర సంవత్సరాలలో దళితులపై 6 వేలకు పైగా దాడులు చేశారని, 188 మంది దళితులను హత్య చేశారని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నా ఎస్సీలు అంటూనే జగన్ రెడ్డి వారిపై ధమనకాండ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ రెడ్డి పాలనలో వారానికి నలుగురు దళితులను హత్యలు చేస్తున్నారని, ఆరుగురు హత్యాయత్నాలకు, రోజుకు ఇద్దరు దళితులపై దాడులు వారానికి ముగ్గురు దళిత మహిళలపై మానభంగాలకు తెగబడుతున్నారని మండిపడ్డారు. దళిత మహిళల ఆత్మగౌరానికి భంగం కలిగించే కేసులలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మొదట స్థానంలో ఉందని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో స్పష్టం చేసిందని గుర్తు చేశారు. వైసీపీకి సహకరించిన పోలీస్ అధికారులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని నాగ జగదీష్ హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో కాయల ప్రసన్నలక్ష్మి సిమ్మిటి రామకష్ణ రేవడి కష్ణతదితరులు పాల్గొన్నారు.



ఎస్‌పికి వినతిపత్రం ఇస్తున్న టిడిపి నాయకులు

ఫేక్ వాయిస్ కాల్స్‌పై ఎస్‌పికి ఫిర్యాదు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఫేక్ వాయిస్ కాల్స్ కారకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జిల్లా అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్‌కు టిడిపి నేతలు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ టీడీపీ మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణను రాజకీయంగా ఎదుర్కోలేకే, ఓటమి భయంతోనే దుష్ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఫేక్ వాయిస్ కాల్స్ వైకాపా పేటియం బ్యాచ్ పనేనని టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్ నంబర్ 8038461027 నుండి ఎటువంటి ఫోన్లు వచ్చినా ప్రజలు స్పందించవద్దని విజ్ఞప్తి చేశారు. పీలా గోవింద సత్యనారాయణపై వస్తున్న ఫేక్ వాయిస్ కాల్స్‌ను అనకాపల్లి నియోజకవర్గ ప్రజలు నమ్మొద్దని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పోలారపు త్రినాథ్, బొద్దపు ప్రసాద్, పచ్చికూర రాము, తలారి కాశీ నాయుడు, ఎంపీటీసీలు నారాపిన్ని చంద్ర శేఖర్, తోతాడ విజయ్, దాడి జగన్, పిట్లా రాజు, సూరి సతీశ్ కుమార్, ఆకుల నానాజీ, బత్తుల రమేష్, పాల్గొన్నారు.

కొణతాల రామకృష్ణకు ఘన స్వాగతం

ప్రజాశక్తి-అనకాపల్లి : జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను కలిసి హైదరాబాదు నుంచి విశాఖపట్నం వచ్చిన కొణతాల రామకృష్ణకు ఘన స్వాగతం పలికేందుకు ఆయన అభిమానులు నాయకులు విశాఖ ఎయిర్ పోర్టుకు శుక్రవారం తరలి వెళ్లారు. అనంతరం ఎయిర్ పోర్టు నుంచి వైజాగ్ ఆఫీస్ వరకు కాన్వాయ్‌తో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర చర్చా వేదిక నాయకులు అభిమానులు, నాయకులు పాల్గొన్నారు.

సుగర్స్ క్వార్టర్స్‌లో మద్యం వ్యాపారంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : మద్యం వ్యాపారానికి అడ్డాగా తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ క్వార్టర్స్ నిలుస్తుందని సుగర్ ఫ్యాక్టరీ షేర్ హోల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గొర్లి మోదు నాయుడు ఆరోపించారు. ఫ్యాక్టరీ ఎమ్‌డి అనేక అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ క్వార్టర్స్‌లో మద్యం వ్యాపారం నిర్వహిస్తున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్లామని, దీనిపై ఎండి నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం వెనక ఈ మద్యం వ్యాపారం వ్యవహారంలో ఆయనకు పాత్ర ఉందని భావించాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఫ్యాక్టరీ క్వార్టర్స్ కేంద్రంగా అనేక అక్రమ వ్యాపారాలు సాగుతున్నట్లు ఆయన ఆరోపించారు. జరుగుతున్న అక్రమాలపై హైకోర్టును ఆశ్రయిస్తామని ఎమ్‌డి దృష్టికి తీసుకువెళ్లినా ఆయన నిర్లక్ష్యంగా సమాధానం చెబుతూ తమకు లాయర్లు ఉన్నారని చెప్పారని పేర్కొన్నారు. అక్రమ వ్యాపారాలు జరుగుతుండడంపై ఫ్యాక్టరీ యాజమాన్యం, సిబ్బంది మౌనం వెనుక వారి ఆర్థిక ప్రయోజనాలు ఉన్నాయని సందేహం కలుగుతుందన్నారు.

పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ

ప్రజాశక్తి-దేవరాపల్లి

పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై గ్రామపంచాయతీ సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజులు శిక్షణ కార్యక్రమం జరిగింది. శుక్రవారం జరిగిన సమావేశంలో ఎంపిపి కిలపర్తి రాజేశ్వరి ముఖ్యఅతిథిగా పాల్గొని పంచాయితీ అభివృద్ధి ప్రణాళికలపై మాట్లాడారు. అనంతరం ఎంపీడీవో సిహెచ్ సుబ్బలక్ష్మి, తహశీల్దార్ యం.లక్ష్మి, ఎంపీడీవో పరిపాలన అధికారి జివి.రమణ, ఇంచార్జ్ ఈఓపిఆర్‌డి జి.సంతోషి నళిని పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి కిలపర్తి రాజేశ్వరి

యువకుల మధ్య తరచూ గొడవలు

- విచక్షణ రహితంగా దాడులు చేసుకుంటున్న వైనం
- చిన్న వివాదాలు సామాజిక తరగతుల మధ్య ఘర్షణగా మారడంపై పలువురు ఆందోళన
- పోలీసుల పర్యవేక్షణ కరువు

ప్రజాశక్తి-చోడవరం

చోడవరం, పరిసర ప్రాంతాల్లో తరచూ యువకుల మధ్య తగాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ తగాదాల్లో ఒకరిపై ఒకరు విచక్షణ రహితంగా దాడులకు పాల్పడుతున్నారు. పండగ సీజన్‌లో తీర్థాలు, కోడి పందేలు, జూదం వంటి వాటి వద్ద వివాదం ప్రారంభమై చివరకు అవి సామాజిక తరగతుల మధ్య తగాదాలుగా మారుతుండడంపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇటీవల బుచ్చెయ్యపేట మండలం మంగళాపురం వడ్డాది మధ్య పొలంలోని కల్లాల్లో నిర్వహించిన కోడి పందేలు వద్ద తగాదాపడి వరుసగా రెండు రోజులు అదే పనిగా గొడవ పడుతూ, చివరికి వడ్డాది రెల్లివీధికి చెందిన ఓ యువకుడిని అదే గ్రామానికి చెందిన కొంతమంది యువకులు కోడి కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన సంగతి తెలిసిందే. దీనిపై బాధిత సామాజిక తరగతి వారు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టడంతో చివరకు పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేసి ఏడుగురు యువకులను అరెస్ట్ చేశారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ఘర్షణకు ముందు నాలుగు రోజుల నుండి అక్కడ కోడిపందేలు జరుగుతున్నాయని పోలీసులు గమనించకపోవడం వల్లే పరిస్థితి హద్దు మీరిందని పలువురు అంటున్నారు.

చోడవరం పంచాయితీ పరిధి అన్నవరం వద్ద తీర్థంలో నాలుగు రోజుల క్రితం యువకులు తగాదా పడ్డారు. ఇది కూడా చివరికి సామాజిక తరగతుల మధ్య తగాదాగా మారింది. ఒకరిపై ఒకరు దూషణతో ప్రారంభమై పరస్పరం కొట్టుకోవడంతో పట్టణంలో ఘర్షణ వాతావరణం నెలకొంది. అనకాపల్లి డిఎస్‌పి సంఘటన స్థలాన్ని పరిశీలించి ఇరువర్గాలను రప్పించి స్టేషన్లో పెద్దల సమక్షంలో రాజీ కుదిర్చారు. భవిష్యత్తులో ఎటువంటి తగాదాలు చోటుచేసుకున్నా తీవ్ర పరిణామాలు ఉంటాయని డిఎస్‌పి హెచ్చరించారు.

వచ్చేది ఎన్నికల కాలం. ఏ పార్టీకైనా మనుషులు అవసరం ఉంది. అందులోనూ యువతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఎన్నికల తంతును జరిపిస్తారు. ఇటువంటి నేపథ్యంలో కులాల మధ్య చిచ్చు రగిలితే ఎస్సీ, ఎస్టీ, బడుగులు బలవుతారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రెచ్చిపోతున్న యువకులు

చోడవరం పట్టణంలో యువకులు, బైక్ రేసర్లు రెచ్చిపోతున్నారు. విచ్చలవిడిగా రోడ్లపై హల్ చల్ చేయడం పరిపాటిగా మారింది. ఇటీవల పోలీస్ స్టేషన్ ముందే ముగ్గురు యువకులు బైక్‌పై వెళ్తూ రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న ఓ విద్యార్థినిని ఢీ కొట్టి పరారయ్యారు. ఆమె స్వల్ప గాయాలతో బయటపడింది. పై సంఘటనల్లో పోలీసుల పర్యవేక్షణ సరిగా లేకపోవడం కనిపిస్తోంది. ఏది ఏమైనా పోలీసులు అప్రమత్తంగా ఉండవలసిన అవసరం ఎంతైనా ఉందని, రాజకీయాలకు తలవంచకుండా, నిష్పక్షపాతంగా పోలీసులు వ్యవహరిస్తే తప్ప పరిస్థితులు అదుపులో ఉండవని పలువురు అభిప్రాయపడుతున్నారు.

లెనిన్ శత వర్ధంతి సభలను జయప్రదం చేయండి

సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి-అనకాపల్లి

శ్రామిక వర్గ విప్లవ నేత, 20వ శతాబ్దపు గొప్ప మార్క్సిస్టు మేధావి కామ్రేడ్ వి.ఐ.లెనిన్ శత వర్ధంతి పురస్కరించుకొని జనవరి 21 నుండి సంవత్సరం పొడవునా వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా ఈ నెల 21న జిల్లా వ్యాప్తంగా వర్ధంతి సభలు జరపాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. కమ్యూనిస్టు అభిమానులు, శ్రేయోభిలాషులు, ప్రగతిశీలవాదులు, ప్రజలందరూ ఈ కార్యక్రమాల్లో పాల్గొని నివాళులర్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రపంచంలోనే మొట్టమొదటి శ్రామిక వర్గ రాజ్యం సోవియట్ యూనియన్‌ను సాధించిన ఘనత లెనిన్ నాయకత్వానికి దక్కుతుందన్నారు. అసమానతలు లేని సోషలిస్టు సమాజ నిర్మాణానికి పునాదులు వేశారని, అమానుషమైన పెట్టుబడిదారీ దోపిడీకి విరుగుడు సోషలిజమేనని ఆయన ఆచరణలో రుజువు చేశారని పేర్కొన్నారు. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ దశలో ప్రజల సంపద కార్పొరేట్ పాలవుతున్న కాలంలో లెనిన్ ఆవశ్యకత మరింత పెరిగిందని తెలిపారు. భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమాన్ని లెనిన్ గట్టిగా బలపరిచారని, సామాజిక అణిచివేతలకు వ్యతిరేకంగా జరుగుతున్న నాటి సామాజిక ఉద్యమాలను ఆయన ప్రత్యేకంగా గమనంలోకి తీసుకున్నారని గుర్తు చేశారు. ఇంత దూర దృష్టి కలిగిన మహా నాయకుడు శత వర్ధంతిని జరుపుకోవడం మన అందరి బాధ్యత అని పేర్కొన్నారు. భారతదేశ అభ్యున్నతికి లెనిన్ సిద్ధాంతం మార్గదర్శకం అవుతుందన్నారు.

మరింత అధికంగా రైతు రుణాలు మంజూరు



వ్యవసాయ శాఖ కెలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రవి తదితరులు

ప్రజాశక్తి- అనకాపల్లి

జిల్లాలో వ్యవసాయ అనుబంధ రంగాల రైతులకు మరింత ఎక్కువగా రైతు రుణాలు మంజూరు చేయించాలని జిల్లా కలెక్టర్ రవి పట్టణన్ శెట్టి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో చైర్మన్ చిక్కాల రామారావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు కల్పించే రుణ సదుపాయాలను గుర్తి రైతులకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. అర్హత ఉన్న వారిలో అవసరమైన వారందరికీ వ్యవసాయ పశుసంవర్ధక మత్స్య ఉద్యానవన, బిందు సేద్య మొదలగు శాఖలకు సంబంధించి రుణాలను సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో ఎటువంటి సమస్యలకు తావు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు, వివిధ వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ కు అధికారులు దిశానిర్దేశం చేయాలన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సలహా మండలి సభ్యులు ఎస్ .రమణ, ఏ.సూరి అప్పారావు వ్యవసాయ శాఖ జెడీ మోహనరావు, సహకార బ్యాంకు మేనేజర్ వర్మ, పశుసంవర్ధక శాఖ జెడి ప్రసాద రావు, మత్స్య శాఖ డిడి ప్రసాద్, ఉద్యానవన శాఖ డిడి ప్రభాకర్ రావు, ఏపీఎంఐపీ ఏడి జీవీ లక్ష్మి, డీఎస్‌ఓ కె వి ఎల్ ఎన్ మూర్తి, లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ, తదితర శాఖల అధికారులు వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.



పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్న టిడిపి నేత పైలా ప్రసాదరావు

గ్రామాల్లో ఘనంగా తీర్థ మహోత్సవాలు

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని కలిగొట్ల గ్రామంలో పైడితల్లి అమ్మవారి తీర్థ మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు అమ్మవారికి తమ ముక్కులను తీర్చుకున్నారు. టిడిపి మాడుగుల నియోజకవర్గం నాయకులు పైలా ప్రసాదరావు, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని కాశీపురం, మునిడిపల్లి గ్రామాల్లో గ్రామదేవతల ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, అమ్మవారి ఊరేగింపులు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో క్లస్టర్ ఇంచార్జి దొగ్గ దేముడునాయుడు, టిడిపి మండల మాజీ అధ్యక్షులు బండారు రామారావు, పాల సంఘం అధ్యక్షులు గొరపోటు నరసింహామూర్తి, కొటకల లక్ష్మణ్, దొగ్గ సతీష్, నారాయణమూర్తి, బండారు రామారావు మాస్టర్, గుల్లిపల్లి దేముడుబాబు, గొరపోటు రమేష్, సంతోష్, నాడు నరసింహామూర్తి, గొరపోటు రామారావు, సంతోష్, లెక్కల సత్తిబాబు, గట్రెడ్డి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ఇవిఎంలపై అవగాహన

ప్రజాశక్తి-అనకాపల్లి

జీవీఎంసీ 80వ వార్డు పరిధి సతకంపట్టు స్కూల్ ఆవరణలో బూత్ నెంబర్ 229, 230 ఈవీఎం డెమో శుక్రవారం రెవెన్యూ అధికారులు రాజకీయ పార్టీల సమక్షంలో నిర్వహించారు. ఇవిఎంలు ఏ విధంగా పనిచేస్తున్నాయో బిఎల్‌వో చేసి చూపించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా తెలుగు అధికార ప్రతినిధి బొడ్డేడ మురళి మాట్లాడుతూ ఈవీఎంలలో ఏ పార్టీకి ఏ సింబల్ నొక్కితే దాని ప్రకారంగా అక్కడ ఓటు పడుతుందో లేదో డెమోలో చూపించారని, తీసుకువచ్చిన ఈవీఎంలు సక్రమంగానే పని చేశాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బూత్ ఏజెంట్ ఆదారి జగన్నాధరావు, పెంటకోట వెంకటరమణ, బుద్ధ లక్ష్మీ అప్పారావు, సూరిశెట్టి నూక శివ అప్పారావు, బుద్ధ కాశీ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.



ఇవిఎంలపై అవగాహన కల్పిస్తున్న రెవెన్యూ అధికారులు

ముఖ్యమంత్రి బహిరంగ సభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి

విశాఖపట్నం జిల్లా భీమిలిలో ఈ నెల 25న జరిగే ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని స్థానిక జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాష్కరరావు, మండల అధ్యక్షుడు బూరె బాబురావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం వారు స్థానిక విలేఖర్లతో మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అన్ని స్థానాల్లో వైఎస్సార్సీపీ గెలుపే లక్ష్యంగా సిఎం జగన్ కేడరుకు దిశా నిర్దేశం చేస్తారన్నారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరిస్తారన్నారు. ఈ బహిరంగ సభకు మండలంలోని అన్ని పంచాయితీల నుండి వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో తరలిరావాలని వారు కోరారు.

ఉర్లోవను వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయాలని

ఆదివాసీల ఆందోళన



నినాదాలు చేస్తున్న నాయకలు, గిరిజనులు

ప్రజాశక్తి-మాడుగుల: ఉర్లోవను రెవెన్యూ వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయాలని మోకాళ్లపై ఆదివాసీలు ధర్నా చేశారు. మండలంలోని బొమ్మలి జగన్నాధపురం పంచాయతీ గదబూరు గ్రామంలో మోకాళ్లపై నిలుచునిశుక్రవారం వినూత్నంగా నిరసన తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు కార్లే భవాని, ఆంధ్రప్రదేశ్ ఆదివాసి గిరిజన సంఘం నాన్ షెడ్యూల్ ఏరియా జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరట నరసింహమూర్తి మాట్లాడారు. భూములకు చట్టపరమైన హక్కులు కల్పించాలని, ఉర్లోవ రెవెన్యూ వెబ్లాండ్ రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గ్రానైట్ కంపెనీ నుండి రక్షణ కల్పించాలన్నారు. ఉర్లోవ రెవెన్యూ పరిధిలో 450 ఎకరాల్లో 350 మంది ఆదివాసి గిరిజనులు, ఇతర పేదలు జీడి మామిడి తోటలను సాగు చేస్తున్నారని, వీరికి 2013 సంవత్సరంలో పట్టాలు ఇచ్చారని తెలిపారు. ఉర్లోవ రెవెన్యూ గ్రామం రెవెన్యూ రికార్డులో రెవెన్యూ విలేజ్ మ్యాప్ కూడా ఉందని, అన్ సెటిల్మెంట్ విలేజ్‌గా నమోదు చేశారని, రెవెన్యూ రికార్డు లేకపోవడంతో ఆదివాసి గిరిజనులకు ఇచ్చిన పట్టాలని నమోదు చేయలేదని వారు తెలిపారు. మరోవైపు గ్రానైట్ క్వారీలకు విరివిగా అనుమతులు మంజూరు చేస్తున్నారని వారు విమర్శించారు. అనేకసార్లు ధర్నాలు, ప్రదర్శనలు, నిరసనలు చేపడుతున్నప్పటికీ గిరిజనులపై వివక్ష కొనసాగుతుందన్నారు. భూములకు హక్కులు కల్పిస్తామని, రైతు భరోసా, ఈ క్రాఫ్ట్ బ్యాంకు పంట రుణాలు వంటి పథకాలు అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెపుతున్నా.. రెవెన్యూ రికార్డుల్లో నమోదు కాకపోవడంతో ప్రభుత్వ పథకాలు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించకుంటే జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద వంటావార్పు చేపడతామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఈదల మచ్చి రాజు, నిమ్మకాయల రాము, గేదెల నూకరాజు, ఈదెల కరుణ, ఖాతా చిలుకు మరియు గిరిజనులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్

సిఎం సభకు భారీగా తరలిరావాలి - ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్: భీమిలిలో ఈ నెల 25న జరిగే సిఎం జగన్ మోహన్ రెడ్డి సభకు నియోజకవర్గం నుంచి ప్రజలు భారీగా అధిక సంఖ్యలో తరలిరావాలని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ, నియోజకవర్గాల క్రియాశీల కార్యకర్తలతో జగన్ సమావేశం కానున్నారని, ఇదులో భాగంగానే ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. పార్టీలు చూడకుండా జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అందించారని ప్రజలంతా మరోసారి జగన్మోహన్ రెడ్డి ని గెలిపిచాంలని కోరారు. నర్సీపట్నం నియోజకవర్గం నుంచి 7500 మంది వెళ్లాలని నిర్ణయించామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీనుకు బెయిల్ ఇవ్వాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: భారత రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులను నిరాకరిస్తూ 2019 సంవత్సరం నుండి కోడి కత్తి శ్రీనును బయటకు రాకుండా అడ్డుకుంటున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వైఖరిని బహుజన సమాజ్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని నర్సీపట్నం నియోజకవర్గం బిఎస్పీ అభ్యర్థి బొట్ట నాగరాజు తెలిపారు. శ్రీనును జైలులో పెట్టి కుటుంబానికి దూరం చేసారన్నారు. స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ, ఆర్టికల్ 19 ప్రకారం నిరసన తెలియజేసే హక్కును నిరాకరించడం తగదన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దీన్ని సుమోటోగా స్పందించి శ్రీనుకు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ఈ కేసును 307గా పెట్టడం సరికాదన్నారు. రాజ్యాంగాన్ని అడుగడుగున ఉల్లంఘిస్తూ మరోపక్క అంబేద్కర్ విగ్రహాలను పెట్టడాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గం అధ్యక్షుడు ఎన్.చిరంజీవి, నియోజకవర్గ కన్వీనర్ కొల్లు గంగాధర, నాయకులు మహేష్ పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న అధికారులు, నేతలు

అంబేద్కర్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: అన్ని వర్గాల్లో అణగారిన ప్రజలకు రక్షణ కల్పించే విధంగా రాజ్యాంగాన్ని రచించిన మహెూన్నత వ్యక్తి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని తహసిల్దార్ అన్నాజీరావు కొనియాడారు. శుక్రవారం ఆర్డిఓ జయరామ్ ఆదేశాల ప్రకారం ఆర్డిఓ సమవేశ మందిరంలో సామాజిక సమతా సంకల్ప మహెూత్సవం ముగింపు సభను డివియంసి మెంబర్ అప్పలరాజు ఆధ్వర్యంలో జరిగింది. ముందుగా అంబేద్కర్ భారీ చిత్రపటానికి అధికారులు, డివిఎంసి సభ్యులు ఘన నివాళులు అర్పించారు. రాష్ట్ర రాజధానిలో 125 అడుగుల భారీ కాంస్య విగ్రహాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ పరిపాలన అధికారి సూర్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ పూడి రవిబాబు, డీవియంసి సభ్యులు రేబాక మధుబాబు, దళిత సేవా పరిరక్షణ (డి యస్ పి) జిల్లా అద్యక్షులు యాదగిరి దాసు, సీనియర్ దళిత నాయకుడు యల్లాజి, హౌసింగ్ ఏఈ జికేయస్ నాయుడు, వసతి గహ సంక్షేమ అధికారులు సంఘం జిల్లా అధ్యక్షులు అడిదెల బాబూరావు పాల్గొన్నారు.

పలుచోట్ల జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి-గొలుగొండ: పప్పుశెట్టిపాలెం గ్రామ పంచాయతీలో సర్పంచ్ మాకిరెడ్డి విజయలక్ష్మి ఆధ్వ ర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజ లంతా ఆరోగ్యంగా ఉండాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శ్యాం కుమార్, ఎంపీడీవో డేవిడ్ రాజ్, వైద్యులు కీర్తి, చేతన్, రాజు పాల్గొన్నారు.

కోటవురట్ల: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో అట్టహాసంగా ప్రారంభించిన ఆరోగ్య సురక్ష శిబిరాలు వెలవెల బోతున్నాయి.మండలంలో శుక్రవారం కైలాస పట్నం గ్రామంలో నిర్వహించిన శిబిరానికి రోగులు అంతంత మాత్రమే హాజరయ్యారు. గత ఏడాది సెప్టెంబర్ నెలలో నిర్వహించిన ఆరోగ్య శిబిరానికి అధికారులు చేసిన హడావిడి ఈసారి చేయకపోవడం విశేషం. గతంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కంటి పరీక్షలు నిర్వహించినా రోగులకు నేటికీ కంటి అద్దాలు ఇవ్వలేదని పలువురు వాపోతున్నారు.

కె.కోటపాడు :జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా మెరుగైన వైద్యం ప్రజలకు వారి ఇంటి వద్దనే అందిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ హేమంత్ కుమార్ అన్నారు. మండల కేంద్రం కె.కోటపాడు సచివాలయం వద్ద శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష -2 కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి నాగలక్ష్మి, ఎంపీడీవో ప్రసాదు, వైద్యులు పాల్గొన్నారు.

అనకాపల్లి : మండలంలోని రేబాక ఎంపీయుపి పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం లబ్ధిదారులకు కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. సర్పంచ్ మార్టూరు సన్యాసమ్మ, ఎంపీటీసీ మంత్రి సంతోషం, మార్టూరు భాస్కరరావు, మంత్రి సత్యనారాయణ, సచివాలయం కన్వీనర్ కోన కిశోర్ కుమార్, ఎంపీడీవో కె.నరసింహారావు, ఈవోపీఆర్డి కే ధర్మారావు, ఏసిడిపిఓ టి.శశికళ, స్పెషలిస్ట్ డాక్టర్లు పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని కోరాడ గ్రామంలో శుక్రవారం ఏర్పాటుచేసిన జగనన్న సురక్ష శిబిరాన్ని డిఎం అండ్ హెచ్ఓ పి.జగదీష్ ప్రారంభించారు. డిఎం అండ్ హెచ్ఓ మాట్లాడారు. డిపిఎంఓ ఉమాదేవి, సిబ్బంది శ్రీను, సర్పంచ్ కె.లక్ష్మణరావు పాల్గొన్నారు.

కశింకోట : ఆరోగ్య శిబరాలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కలగా లక్ష్మి గున్నయ్యు నాయుడు అన్నారు. కశింకోట బాలికల స్కూల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శుక్రవారం జరిగింది. నేత్ర సమస్యలు ఉన్న వారికి కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. వైసిపి జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లి బాబు, వైస్ ఎంపీపీ పెంట కోట జ్యోతి శ్రీనివాసరావు, సర్పంచ్ జయ రజని పాల్గొన్నారు.



ప్రచారం చేపడుతున్న నేతలు

కాంగ్రెస్ నేతల ప్రచారం

ప్రజాశక్తి-మాడుగుల: గిరిజన గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ప్రచారం ప్రారంభించింది. శుక్రవారం మండలంలోని రామచంద్రపురం గిరిజన గ్రామంలో మాడుగుల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ పడాల కొండలరావు ఇంటింటి ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ కొండలరావు మాట్లాడుతూ, ఈనెల 21న విజయవాడలో పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల ప్రమాణ స్వీకారానికి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, వైయస్ రాజశేఖర్ రెడ్డి అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుడబండి రాజు, నియోజకవర్గ యువజన నాయకుడు మైలపల్లి యేసు రాజు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మై చర్ల జగ్గారావు, కింతలి జగ్గారావు, పిల్లా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఐసి అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: స్థానిక ఎల్‌ఐసి కార్యాలయం వద్ద శుక్రవారం లైఫ్ ఇన్సూరెన్స్ ఉద్యోగ సంఘం అసోసియేషన్ సభ్యులు ఆధ్వర్యంలో జాతీయకరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిఇయు సెక్రటరీ కె.కేశవభద్రం మాట్లాడుతూ, 1956వ సంవత్సరంలో జీవిత భీమా రంగం జాతీయకరణ జరిగిందన్నారు. ఈ అరవై ఎనిమిది సంవత్సరాల్లో ప్రభుత్వాలకు సహకరిస్తూ డివిడెంట్ ఫండ్ రూపంలో ఐదు శాతం అందిస్తుందని, ప్రజా సంక్షేమం కొరకు 43 లక్షల 97 వేల 204.59 కోట్లు అదించిందని తెలిపాఆరు. ఇదే స్ఫూర్తితో సంస్థ అభివృద్ధికి ఏజెంట్లు, విస్తరణ అధికారులు, ఎల్‌ఐసి ఉద్యోగులు బాధ్యతాయుతంగా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ సభ్యులు ధనార్జన్, చక్రధర్, బియమ్ క్లాస్ వన్ అసోసియేషన్ సభ్యులు సిహెచ్ శ్రీనివాస్, కోదండరామయ్య, ఎన్ ఎఫ్ ఐ ఎఫ్ డబ్ల్యూఐ వై.నాగేశ్వరరావు, జగన్ మోహన్, విటల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐసిఇయు సెక్రటరీ కేశవభద్రం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి శ్రేణులు

చంద్రబాబుతో సుస్థిర పాలన

ప్రజాశక్తి -నక్కపల్లి: చంద్రబాబుతోనే ప్రజలకు సుస్థిర పాలన అందుతుందని తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ అన్నారు. మండలంలోని దేవవరం గ్రామంలో శుక్రవారం బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ పై ప్రజలకు అవగాహన కల్పించారు. మేనిఫెస్టోకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు.జగన్ పాలనలో ప్రజలకు కష్టాలు తప్ప ఒరిగిందేమీ లేదన్నారు. టిడిపి, జనసేన కూటమితో మంచి రోజులు రానున్నాయన్నారు. పార్టీ శ్రేణులు లక్ష్మణరావు, దేవర సత్యనారాయణ, కొరిమి సూర్య గణేష్, మీసాల బాబులు, బత్తుల రమణ బాబు, తాతబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

చెరుకు బకాయిలు చెల్లింపుపై హర్షం



సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నారాయణమూర్తి

ప్రజాశక్తి - వడ్డాది: చెరకు రైతుల అభ్యున్నతకి జగన్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని వైస్ ఎంపిపి దొండా లలిత నారాయణమూర్తి కొనియాడారు. బుచ్చయ్య పేట మండలం వడ్డాది చెరుకు కాటా వద్ద ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణమూర్తి మాట్లాడుతూ, సుగర్ ఫ్యాక్టరీకి రూ.12 కోట్ల గ్రాంట్ రూపంలో రైతులకు నిధులు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. సుగర్ ఫ్యాక్టరీనీ ఆదుకున్న జగన్మోహన్ రెడ్డి, ధర్మ శ్రీలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కోవెల జనార్ధన్ రావు, రమణ, ఈశ్వరరావు, చెరుకు రైతులు నాలం శ్రీరామ్‌మూర్తి, ఈశ్వరరావు, వరహాలు, కొండయ్య, లక్ష్మీ పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట: గోవాడ చక్కెర కర్మాగారం సభ్య రైతులకు గత ఏడాది సరఫరా చేసిన చెరుకు సంబంధించి బకాయిలు చెల్లించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, బుచ్చయ్యపేట చెరుకు కాటా వద్ద గురువారం స్థానిక జడ్పిటిసి దొండ రాంబాబు తదితరులు ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి మాట్లాడుతూ బకాయి నగదు చెల్లించడానికి స్థానిక శాసనసభ్యులు కరణం ధర్మ శ్రీ కృషి చేశారన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు జోగా కొండబాబు, సర్పంచ్ పెద్దాడ నాయుడు బాబు, మాజీ సర్పంచ్ సుంకర సత్యారావు, మాజీ ఎంపీటీసీ తాతబాబు పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు వినతులు

-సిఎం జగన్ తమ డిమాండ్లను నెరవేర్చేలా చూడాలని వేడుకోలు

-కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె



చీడికాడలో అంబేద్కర్ విగ్రహం వద్ద నినదిస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి- విలేకర్ల బృందం

సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీలు శుక్రవారం సమ్మెను కొనసాగించారు. విజయవాడలో సిఎం జగన్ అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ సందర్భంగా జిల్లాలో అంగన్‌వాడీలు నిరసనలు చేపట్టారు. సిఎంకు మంచి బుద్ధిని ప్రసాదించాలని అంబేద్కర్ విగ్రహాలకు వినతులు సమర్పించారు.

విశాఖ కలెక్టరేట్ : 39 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలు తమకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి చెప్పాలని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌ను కోరుతూ శుక్రవారం విశాఖ నగరంలో ర్యాలీ నిర్వహించారు. జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి ఎల్ఐసి కార్యాలయం దరి అంబేద్కర్ విగ్రహం వరకు వారి ప్రదర్శన సాగింది. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వారు వినతిపత్రం సమర్పించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ ఇవ్వాలని, తమ పట్ల, సమ్మె పట్ల మొండిగా వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మనసు మారే విధంగా చూడాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షురాలు పి.మణి, అధ్యక్షురాలు వై.తులసి మాట్లాడారు. కార్యక్రమంలో అర్బన్ ప్రాజెక్ట్ కార్యదర్శి ఎం.వెంకటలక్ష్మి, అధ్యక్షులు ఎ.నూకరత్నం, ఎఐటియుసి అనుబంధ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.శ్యామలాదేవి, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్ పాల్గొన్నారు.

పలువురు మద్దతు

జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద అంగన్‌వాడీల సమ్మె శిబిరాన్ని బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్, దక్షిణ నియోజకవర్గం కార్పొరేటర్లు విల్లూరి భాస్కరరావు, పురుకూటి నారాయణరావు, చెన్నా జానకిరామ్, బిపిన్ కుమార్ జైన్, డిటిఎఫ్ నగర అధ్యక్షుడు ధర్మేందర్ తదితరులు సందర్శించి మద్దతు తెలిపారు.

పెందుర్తి : పెందుర్తి తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెను కొనసాగించారు. సమ్మె శిబిరాన్ని ఉద్దేశించి సిఐటియు సీనియర్ నాయకులు పి.వెంకటరెడ్డి మాట్లాడుతూ, మున్సిపల్ వర్కర్లు ఐక్య పోరాటం వల్లే సమస్యలను పరిష్కరించుకోగలిగారని తెలిపారు. రానున్న రోజుల్లో ఈ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజా ఉద్యమంగా మార్చుదామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి జగన్, ఐద్వా నాయకులు బి.అనంతలక్ష్మి, పౌర సంక్షేమ సంఘ సభ్యులు ఇందిర, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బృందావతి, దేవి, భవాని తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస: తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ అంగన్‌వాడీలు తగరపువలస వై జంక్షన్‌లో రిలే నిరాహారదీక్షలు చేశారు. దీక్షలో కూర్చున్న అంగన్‌వాడీలకు ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) భీమిలి ప్రాజెక్ట్ గౌరవాధ్యక్షులు కె.వెంకటలక్ష్మి పూల మాలలు వేసి దీక్షలను ప్రారంభించారు. డిమాండ్లను నెరవేర్చకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ఎస్ఎన్.మూర్తి, నాయకులు రవ్వ నరసింగరావు, భీమిలి ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీదేవి, కొవ్వాడ లక్ష్మి, జిల్లా కోశాధికారి కె.పద్మావతి తదితరులు పాల్గొన్నారు. రిలే దీక్షలు ప్రారంభానికి ముందు స్థానిక జంక్షన్‌లో ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి యూనియన్ నాయకులు మూర్తి, నరసింగరావు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు.



దేవరాపల్లిలో ఆకులో మట్టిని తింటూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

మునగపాక : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి 39వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా మునగపాక మెయిన్ రోడ్‌లోని శిబిరం వద్ద నుండి సంతబయలు వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడున్న బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం న్యాయబద్ధమైన తమ సమస్యలను పరిష్కరించాలని, మొండి వైఖరి విడనాడాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వివి శ్రీనివాసరావు, గనిశెట్టి సత్యనారాయణ, ఎస్ బ్రహ్మాజీ, యూనియన్ నాయకులు జయలక్ష్మి, రామలక్ష్మి, అంజలి, హేమలత, ఉమా, సరస్వతి, మంగ తల్లి, తులసి లక్ష్మి, లక్ష్మి, రేణుక సత్యవతి, ముల్లి లక్ష్మి పాల్గొన్నారు.

రాంబిల్లి : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం పరిధిలో అంగన్వాడీలు 39వ రోజు ఆందోళనలో భాగంగా రాజ్యాంగ నిర్మాత బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి వినతిపత్రం సమర్పించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి దేముడు నాయుడు, ఐద్వా జిల్లా అధ్యక్షులు పి మాణిక్యం అంగన్వాడీ యూనియన్ నాయకులు మంగ, సుజాత, లక్ష్మి, నూక రత్నం, సంతోషి, రమణమ్మ, సావిత్రి, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ఆకుల్లో మట్టివేసి తింటూ నిరసన

దేవరాపల్లి : 39వ రోజు ఆందోళనల్లో భాగంగా దేవరాపల్లి, కె.కోటపాడు మండలాలకు చెందిన వందలాది మంది అంగన్వాడీలు స్థానిక తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా శిబిరంలో ఆకుల్లో మట్టి వేసుకొని తింటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు జి.కూమారి, భవానీ, కోమలి, పద్మ, అమ్మాజీ, చెల్లయ్యమ్మ, సన్యాసమ్మ తదితరులు మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వం తమ వేతనాలు పెంచకుంటే మట్టి తిని బతకాలా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డి.వెంకన్న, బిటి.దొర, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు గాడి ప్రసాద్ వారికి మద్దతు ఇచ్చి మాట్లాడారు.



నర్సీపట్నంలో...

పరవాడ : పరవాడ తాసిల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు 39వ రోజు నిరసన కార్యక్రమాన్ని కొనసాగించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, అంగన్వాడీ యూనియన్ నాయకులు సిహెచ్ దేవి, ఎం రమణి, ఎస్ పార్వతి, రామలక్ష్మి, అరుణ, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు

చోడవరం : స్థానిక తాసిల్దార్ కార్యాలయం అంగన్వాడీల రిలే నిరాహార దీక్షలు 39వ రోజు కొనసాగాయి. తమకు కనీస వేతనాలు చెల్లించాలని అంగన్వాడీ కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్వీ నాయుడు, యూనియన్ నాయకులు కాంతం, కుమారి తదితరులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : అంగన్వాడీల నిరసన కార్యక్రమంలో మండల కేంద్రంలో శుక్రవారం కూడా కొనసాగింది. అధికారుల ఒత్తిడిని తట్టుకోలేక కోనసీమ జిల్లా ఆత్రేయపురం అంగన్వాడీ కార్యకర్త శాంతకుమారి గుండెపోటుతో మృతి చెందిన నేపథ్యంలో శిబిరంలో ఆమెకు నివాళులర్పించారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వం చేసిన హత్య అని యూనియన్ నాయకులు ఆది వరలక్ష్మి, ఏలిసెట్టి అమ్మాజీ ఆరోపించారు.

గొలుగొండ : అంగన్వాడి కార్యకర్తలను ప్రభుత్వం బెదిరింపులకు దిగకుండా సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ మరియు హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎం.దుర్గారాణి డిమాండ్ చేశారు. మండలం లో 39వ రోజు కొనసాగుతున్న అంగన్‌వాడిల సమ్మె శిబిరానికి శుక్రవారం ఆమె సందర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, ఐద్యా జిల్లా ఉపాధ్యక్షులు యల్.గౌరి, గొలుగుండ ప్రాజెక్టు నాయకులు ఎం మంగతాయారు, సిహెచ్ బ్రమరాంబ, సత్యావేణి తదితర్లు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: స్థానిక అబీద్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేని విధంగా 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి ప్రారంభిస్తున్నారని, ఇది చాలా ఆనందదాయ కమైందని అంబేద్కర్ స్ఫూర్తితోనే మహిళల క్షేమం కోరాలన్నారు. మహిళలకు సమాన హక్కులు కల్పించి తన జీవితాన్ని అంకితం చేసిన అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. మహిళలు 39 రోజుల నుండి సంక్రాంతి సంబరాలు కూడా జరుపుకోకుండా తమ న్యాయమైన సమస్యలను పరిష్కారం చేయాలని పోరాటం చేస్తుంటే నోటీసులిచ్చి బెదిరించడం సమంజసం కాదన్నారు.

అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మంగ మాట్లాడుతూ, 39 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ప్రాజెక్టు నాయకులు సామ్రాజ్యం, మహాలక్ష్మి, కృష్ణవేణి, రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.



నక్కపల్లిలో.

తూతూ మంత్రంగా తెరిచిన కేంద్రాలు

చీడికాడ: సమ్మె కాలంలో అంగన్వాడి కేంద్రాలు రోజు తెరచి బాలింతలకు, గర్భిణీలకు, చిన్న పిల్లలకు పోషకాహారం అందించేందుకు కొన్ని రోజులు వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది సెంటర్లు తెరిచారు. అది రాను రాను నేడు పూర్తిగా పలు గ్రామాలలో అంగన్వాడి కేంద్రాల్లో పూర్తిగా మూతపడ్డాయి. అధికారులు, నాయకులు స్పందించి పోషకాహారాలు నిత్యం అందేలా చూడాలని పలువురు కోరుతున్నారు.



రాంబిల్లిలో..

చీడికాడ: మండల కేంద్రంలో సిఐటియు నేత దేముడునాయుడు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి అంగన్వాడి కార్యకర్తలు, ఆయాలు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వానికి, నాయకులకు చీమకుట్టినట్టు కూడా లేదని, ఇది సిగ్గుచేటన్నారు. హామీలు ఇచ్చి అధికారం పొందాక తుంగలో తొక్కి పరిపాలన చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇప్పటికైనా కళ్ళు తెరిచి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఐసిడిఎస్ కార్యాలయం ముట్టడి

నక్కపల్లి : సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడి వర్కర్స్ చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి 39వ రోజుకు చేరింది. టెర్మినేషన్ నోటీసులను వ్యతిరేఖిస్తూ స్థానిక ఐసిడిఎస్ కార్యాలయాన్ని ముట్టడించారు. తమ పట్ల ప్రభుత్వ మొండి వైఖరి నశించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా, భయాం దోళనకు గురిచేసినా భయపడేది లేదని, సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దుర్గారాణి, ప్రాజెక్టు అధ్యక్షురాలు సుబ్బలక్ష్మి, యూనియన్ నాయకులు కవిత, లక్ష్మీ రాజ్యం, మంగ లక్ష్మీ, రమణమ్మ, జయ, ఆర్ వి కె లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు .



తగరపువలసలో..

కార్మిక సంఘాల ఆధ్వర్యాన సంతకాల సేకరణ

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : అంగన్‌వాడీల పోరాటానికి మద్దతుగా ప్రజల నుంచి సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు కార్మిక సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ద్వారకా బస్‌స్టాండ్ వద్ద కోటి సంకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె.అచ్యుతరావు మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గతంలో ఇచ్చిన హామీలనే అంగన్‌వాడీలు నెరవేర్చాలని అడుగుతున్నారన్నారు. దున్నపోతుమీద వర్షం కురిసిన చందంగా రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. అంగన్‌వాడీల పోరాటానికి రాష్ట్ర వ్యాప్తంగా మద్దతు లభిస్తోందన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.మన్మధరావు, సిఐటియు నాయకులు వి.తులసీరాం, వి.నరేంద్రకుమార్, ఐఎఫ్‌టియు నాయకులు లక్ష్మి, కార్మిక సంఘాల నాయకులు పడాల గోవింద్, పి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.



కార్మిక సంఘాల ఆధ్వర్యాన విశాఖలో సంతకాల సేకరణ